# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202


తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 11 సంచిక : 84 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 28 జులై 2026 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:11 Issue : 84 28-7-2026 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## ఆగస్ట్ 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం..

### ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు



**అమరావతి, జులై 27 తెలుగురాష్ట్రం ప్రతినిధి** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌గా నామకరణం చేసిన ఈ విమానాశ్రయాన్ని ఆగస్ట్ 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఉత్తరాంధ్ర ప్రగతిలో ఈ విమానాశ్రయం ఒక కీలక మైలురాయిగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో రాష్ట్ర విమానయాన రంగంలో ఒక నూతన శకం మొదలవుతుందని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయం కేవలం ప్రయాణ సౌకర్యాలను

- తరువాయి 2లో..

## భోగాపురానికి మోదీ..

### పూర్తి షెడ్యూల్ ఇదే !!



**భోగాపురం జులై 27 తెలుగురాష్ట్రం ప్రతినిధి**. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన దిశగా మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. విజయనగరం జిల్లా భోగాపురంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ప్రారంభోత్సవానికి శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాబోయే ఆగస్టు 1వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేయనున్నారు. ప్రధాని పర్యటన ఖరారు కావడంతో జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం భద్రతా ఏర్పాట్లతో పాటు ప్రారంభోత్సవ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు వేగవంతం చేశాయి. ఈ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి రావడం వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతంలో పర్యాటకం, పరిశ్రమలు, మరియు రవాణా రంగాలు ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు.


**ప్రధాని మోదీ పర్యటన పూర్తి వివరాలు మరియు షెడ్యూల్**

ఆగస్టు 1న ప్రధాని మోదీ భోగాపురంలో సుమారు రెండు గంటలకు పైగా గడపనున్నారు. ప్రధాని పర్యటన షెడ్యూల్ ప్రకారం, ఆయన ఉదయం 10:45 గంటలకు నేరుగా భోగాపురం విమానాశ్రయానికి చేరుకుంటారు. విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం, నూతనంగా నిర్మించిన టెర్మినల్ భవనంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకిస్తారు. ఆ తర్వాత అధికారికంగా విమానాశ్రయాన్ని ప్రారంభించి, అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

- తరువాయి 2లో..

## లోక్‌సభ ముందుకు..

# యాంటీ-పేపర్ లీక్ బిల్లు



**న్యూఢిల్లీ :** పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించే దిశగా కేంద్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ చట్టాన్ని సవరించేందుకు ఇటీవల ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు.

**నిరసనకారులపై బలప్రయోగాన్ని సమర్థించలేం: సీజేఐ కీలక వ్యాఖ్యలు**

మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా

- తరువాయి 2లో..

## మతం మారితే

# 'ఎస్సీ' హోదా కోల్పోయినట్లే..

### మరోసారి స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

**మతం మారితే తక్షణమే ఎస్సీ హోదా రద్దవుతుందన్న సుప్రీంకోర్టు**

**హిందూ, సిక్కు, బౌద్ధ మతస్తులు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని వ్యాఖ్య**

**మతం మారితే ఎస్సీ ప్రయోజనాలు కోల్పోతారని స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ :** షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వర్గానికి చెందిన వ్యక్తి ఇతర మతంలోకి మారితే వారి ఎస్సీ హోదా తక్షణమే రద్దవుతుందని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను కాదని క్రిస్టియానిటీ లేదా ఇతర మతాలను స్వీకరించిన వ్యక్తులకు ఎస్సీ రిజర్వేషన్లు, కుల ధ్రువీకరణ పత్రాలు చెల్లవంటూ గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. 1950 నాటి రాజ్యాంగ ఉత్తర్వుల ప్రకారం... హిందూ, సిక్కు, బౌద్ధ మతస్థులు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని, మతం మారిన మరుక్షణమే ఎస్సీ హోదా, దాని ఆధారిత ప్రయోజనాలు ముగుస్తాయని స్పష్టం చేసింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎలాంటి పొరపాటు లేదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. పునఃపరిశీలన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఒకవేళ ఎవరైనా తిరిగి ఎస్సీ హోదాను పొందాలంటే... రాజ్యాంగం నిర్దేశించిన మూడు ప్రధాన నిబంధనలకు (పుట్టుకతో ఎస్సీ అయి ఉండటం, స్వచ్ఛందంగా తిరిగి సొంత మతంలోకి రావడం, మూల కుల సమాజం వారిని ఆమోదించడం) కట్టుబడి ఉండాలని ధర్మాసనం పేర్కొంది. సుప్రీంకోర్టు వెలువరించిన ఈ కీలక తీర్పు దేశవ్యాప్తంగా ఉన్న రిజర్వేషన్ విధానాలు, మత మార్పిడి వ్యవహారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

## డీఎస్సీ ఆరోపణలపై జగన్‌తో బహిరంగ చర్చకు

# నేను సిద్ధం

**వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్, భూకుంభకోణాలపైనా చర్చిద్దామని లోకేశ్ సవాల్**

- జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' జబ్బు ఉందని ఎద్దేవా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయమే లక్ష్యమన్న లోకేశ్
- కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేడర్‌కు పిలుపు



**అమరావతి, జులై 27 తెలుగురాష్ట్రం ప్రతినిధి** డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ అధినేత జగన్‌కు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీ అంశంపై జగన్‌తో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని,

- తరువాయి 2లో..

## ఎల్ నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కార్యక్రమాలు



- ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారా
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి, జులై 27 తెలుగురాష్ట్రం ప్రతినిధి.** ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్ నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు... రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు.. ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. దీని నిమిత్తం క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.



- తరువాయి 2లో..

## బంగాళాఖాతంలో..

# వాయుగండం

**ఆ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం!**

**వాయుగుండంగా మారిన అల్పపీడనం 8 భారత వాతావరణ శాఖ హెచ్చరిక**

**రానున్న మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు**



**అమరావతి, జులై 27 తెలుగురాష్ట్రం ప్రతినిధి** దేశంలోని పలు రాష్ట్రాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారిందని, దీంతో ఒడిశాలోని పలు జిల్లాలకు ఆదివారం హెచ్చరికలు జారీ చేసింది. రానున్న 48 గంటల్లో రాష్ట్రంలోని

- తరువాయి 2లో..

# కేంద్రం లెక్కల్లో ఏపీ ఘనత..

- పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో అద్భుతమైన ప్రగతి
- 2025-26లో 3,865 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి
- గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు నాలుగు రెట్లు అధికం
- లోక్‌సభలో వివరాలను వెల్లడించిన కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ
- ప్రభుత్వ విధానాలతోనే ఈ అపూర్వమైన వృద్ధి సాధ్యమైందని వెల్లడి
- 2029 నాటికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం



**అమరావతి, జులై 27 తెలుగురాష్ట్రం ప్రతినిధి** పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీ అద్భుతమైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం ఏకంగా 3,865.63 మెగావాట్ల మేర కొత్త ఇంధన సామర్థ్యాన్ని జోడించింది. ఈ విషయాన్ని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ లోక్‌సభలో వెల్లడించింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు నాలుగు రెట్ల పెరుగుదల కావడం గమనార్హం. తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ ఎం.కె. విష్ణు ప్రసాద్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం

- తరువాయి 2లో..

# త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ..

**రూ.10, రూ.20 నోట్ల ట్రయల్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

- ప్రయోగాత్మక పరిశీలన కోసం వంద కోట్ల చొప్పున నోట్లను ముద్రించనున్న ఆర్బీఐ
- కాగితం నోట్లను రద్దు చేసే ఆలోచన లేదని ప్రభుత్వం స్పష్టీకరణ
- ఎక్కువ కాలం మన్నిక, నకిలీని అరికట్టడం పాలిమర్ నోట్ల ప్రత్యేకత



**న్యూఢిల్లీ :** దేశంలో ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రూ. 10, రూ. 20 విలువ కలిగిన ప్లాస్టిక్ పాలిమర్

- తరువాయి 2లో..

## తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు అభినందనీయం




- పౌరసరఫరాల శాఖ నిర్ణయాన్ని స్వాగతించిన పవన్ కల్యాణ్
- సామాన్యుడికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది
- బీపీటీ సూపర్ ఫైన్ కేజీ రూ.52, పచ్చి బియ్యం రూ.50లకు అందజేయడంతో సామాన్యుడికి ఊరట
- ఆగస్టు 1 నుంచి ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలి
- ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్

**అమరావతి, జులై 27 తెలుగురాష్ట్రం ప్రతినిధి** 'కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినది. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యుడికి సాంత్వన చేకూర్చేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయం' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అన్నారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52లకు, గ్రేడ్ 1 పచ్చి బియ్యం ( రా రైస్ ) రూ.50లకు రాష్ట్రంలోని 130 రైతుబజార్లు,

- తరువాయి 2లో..

## ఆకివీడు రామాలయానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్..

- పిటిషన్ కొట్టివేత
- కలెక్టర్ ఎన్‌వోసీ చట్టబద్ధమేనని స్పష్టీకరణ
- ప్రభుత్వ భూమిలో నిర్మాణానికి అభ్యంతరం లేదన్న కోర్టు
- న్యాయపరమైన అడ్డంకులు తొలగినట్లు స్పష్టత
- తీర్పును స్వాగతించిన రఘురామ కృష్ణంరాజు



**అమరావతి, జులై 27 తెలుగురాష్ట్రం ప్రతినిధి.** పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ప్రతిపాదిత రామాలయ నిర్మాణానికి న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. ఆలయ నిర్మాణాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో నిర్మాణానికి మార్గం సుగమమైంది. జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిరభ్యంతర పత్రం చట్టబద్ధమేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రభుత్వ స్థలంలో నిబంధనల మేరకు ఆలయ నిర్మాణం చేపట్టడంలో ఎలాంటి అభ్యంతరం

- తరువాయి 2లో..

జనరల్ న్యూస్
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# విద్య నాణ్యత పేరుతో అనుభవానికి పరీక్ష?

దేశ నిర్మాణంలో ఉపాధ్యాయు డి పాత్రకు ప్రత్యామ్నాయం లేదు. రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కు సాకారం కావాలంటే పాఠశాల లుండాలి, పాఠ్యపుస్తకాలు ఉండాలి, మౌలిక సదుపాయాలు ఉండాలి. కానీ ఇవన్నింటికంటే ముఖ్యంగా నిబద్ధత, నైపుణ్యం, అనుభవం కలిగిన ఉపాధ్యా యుడు ఉండాలి. అందుకే ఉపాధ్యా య నియామకాల్లో నాణ్యతా ప్రమా ణాలను తీసుకురావాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ప్రవేశపెట్టారు. ప్రారం భంలో ఈ నిర్ణయం విద్యా సంస్కరణగా ప్రశంసలు అందు కున్నప్పటికీ, కాలక్రమేణా అదే టెట్ ఇప్పటికే ఉద్యోగాల్లో కొనసాగుతున్న ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా తప్పని సరిగా మారిన సందర్భాల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. దశాబ్దాలుగా బోధనలో విశిష్ట సేవలందిస్తున్న ఉపాధ్యాయు డు మరోసారి పరీక్ష రాసి తన అర్హతను నిరూపించుకోవా ల్సి రావడం ఎంతవరకు సమంజనం అనే ప్రశ్న ఇప్పుడు విద్యారంగంలో ప్రధాన చర్చగా మారింది. 2009లో విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జాతీయ ఉపాధ్యా య విద్యామండలి (ఎన్సీటీఈ) ఉపాధ్యాయ అర్హతకు దేశ వ్యాప్తంగా కనీస ప్రమాణాలను నిర్దేశించింది. ఆ మార్గదర్శ కాల ప్రకారం టెట్ను ప్రవేశపెట్టారు. కొత్తగా నియమితుల య్యే ఉపాధ్యాయులకు ఇది అవసరమనే విషయంలో పెద్ద గా అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. అయితే టెట్ అమలుకు ముందు నియమితులై, ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఇన్సర్వీస్ ఉపాధ్యా యుల పైనా ఈ నిబంధనలను వర్తింప జ యడం వివా దాస్పదమైంది. ఒకవైపు ఉపాధ్యాయులపై రోజురోజుకూ బాధ్యతలు పెరుగుతున్నాయి. తరగతి బోధనతో పాటు మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ, విద్యార్థుల హాజరు నమోదు, వివిధ ప్రభుత్వ సర్వేలు, ఓటరు జాబితాల సవ రణ, ఎన్నికల విధులు, జనగణన, సంక్షేమ పథకాల అమలు, డిజిటల్ డేటా నమోదు, తల్లిదండ్రుల సమావే శాలు, శిక్షణా కార్యక్రమాలు, పాఠశాల పరిపాలన ఇలా అనేక పనులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మరోసారి టెట్ పరీక్షకు సిద్ధం కావడం వారికి అదనపు భారం అవుతోంది. ముఖ్యంగా 45 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు గల ఉపాధ్యాయులు ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ మళ్లీ పోటీ పరీక్షలకు సిద్ధమవ్వాల్సి రావడం తీవ్ర ఒత్తిడిని కలిగిస్తోంది. ఇన్సర్వీస్ ఉపాధ్యాయులలో చాలామంది పదిహేను, ఇరవై, ముప్పై సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్నారు. వేలాది మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చారు. వైద్యులు, ఇంజి నీర్లు, శాస్త్రవేత్తలు, పరిపాలనా అధికారులు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులను తీర్చిదిద్దిన గురువులే నేడు మరోసారి అర్హతను నిరూపించుకోవాల్సి రావడం సహజం గానే బాధను కలిగిస్తోంది.

**కొన్ని రాష్ట్రాలలో మినహాయింపులు**

ఒక ఉపాధ్యాయుడి సామర్థ్యాన్ని అతని విద్యార్థుల విజయాలు, సేవా చరిత్ర, తరగతి గది నిర్వహణ, సామాజిక బాధ్యతలు తెలియజేస్తే, వాటిని పక్క నబెట్టి కేవలం ఒక ప్రశ్నాపత్రం ఆధారంగా అంచనా వేయ డం న్యాయమా అనే ప్రశ్నకు విద్యాశాఖ సమాధానం చెప్పా ల్సి ఉంది. టెట్పరీక్ష ప్రధానంగా బహుళైచ్ఛిక ప్రశ్నల రూ పంలో నిర్వహించబడుతుంది. బాల మనోవిజ్ఞానం, బోధనా పద్ధతులు, భాష, గణితం, విజ్ఞానశాస్త్రం, సామాజికశాస్త్రం వంటి అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. ఇవి సిద్ధాంతపరమైన అవగాహనను పరీక్షించ గలవు. కానీ ఒక ఉపాధ్యాయుడి బోధనా నైపుణ్యం, విద్యార్థులను ప్రేరేపించే సామర్థ్యం, సమస్యలను పరిష్కరించే చాతుర్యం, విలువల బోధన, తరగతి గది నిర్వహణ వంటి లక్షణాలను పూర్తిగా కొల వలేవు. అనుభవం ద్వారా వచ్చిన ప్రజ్ఞను ప్రశ్నాపత్రంతో కొలవడం సాధ్యం కాదని అనేక మంది విద్యావేత్తలు స్పష్టం చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా పాఠశాల విద్యావ్యవస్థలో సుమారు 95 లక్షలకు పైగా ఉపాధ్యాయులు సేవలందిస్తున్నట్లు కేంద్ర విద్యాశాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. వీరిలో గణ నీయమైన సంఖ్యలో టెట్ అమలుకు ముందే నియమితులై నవారే. కొన్ని రాష్ట్రాలు వారికి మినహాయింపులు ఇచ్చాయి. మరికొన్ని రాష్ట్రాలు మాత్రం టెట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేశాయి. ఒకే దేశంలో ఒకే విధానానికి వేర్వేరు అమలు విధానాలు ఉండటం వల్ల ఉపాధ్యాయుల్లో అయోమయం నెలకొంది.

**ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ**

ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి నిర్దేశిత ప్రమాణాలకు చేరని పాఠశాలలు కూడా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో విధుల్లో ఉన్న ఉపాధ్యాయుల శక్తిని పరీక్షలకే పరిమితం చేయడం కంటే, పాఠశాలల విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి సారించడం అవసరమనే అభి పాయం బలంగా వినిపిస్తోంది. పరీక్షలు నిర్వహించడం కన్నా తర గతి గదిలో బోధనా నాణ్యతను పెంచేకార్యక్రమాలు చేపట్ట డం మరింత ప్రయోజనకరమని నిపుణులు సూచిస్తున్నారు. జాతీయ విద్యా విధానం- 2020 ఉపాధ్యాయుడిని విద్యా వ్యవస్థకు కేంద్రబిందువుగా పేర్కొంది. ఉపాధ్యాయుడు జీవి తాంతం నేర్చుకుంటూ ఉండాలని, సేవలో ఉన్న సమయం లోనూ నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించింది. అయితే ఆ విధానం కూడా పరీ క్షలకే పరిమితం కాలేదు. శిక్షణ, పరిశోధన, సాంకేతిక పరి జ్ఞాన వినియోగం, తరగతి గది పరిశీలన, నూతన బోధనా విధానాల అవలంబన వంటి అంశాలకు ప్రాధాన్యంఇచ్చింది. అందువల్ల ఇన్సర్వీస్ ఉపాధ్యాయుల విషయంలో కూడా అదే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. నిరంతర శిక్షణా కార్యక్రమాలుప్రపం చంలోని అనేక దేశాల్లో సేవలో ఉన్న ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారి తరగ తులను పరిశీలించి సూచనలుఇస్తారు. బోధనా పద్ధతులను నవీకరించే కార్యశాలలు నిర్వహిస్తారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలు, తల్లిదండ్రుల అభిప్రాయాలు, పాఠశాల వరిశీలన నివేదికలు వంటి అనేక అంశాల ఆధారంగా వారి పనితీరును అంచనా వేస్తారు. ప్రతి కొన్నేళ్లకోసారి అర్హత పరీక్షలు నిర్వ హించడం సాధారణ పద్ధతి కాదు. భారతదేశం కూడా పరీక్షా సంస్కృతికి బదులుగా నైపుణ్యాభివృద్ధి సంస్కృతిని పెం పొందించాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయుల ఆత్మగౌర వం దెబ్బతింటే దాని ప్రభావం నేరుగా విద్యార్థులపై పడు తుంది. గురువును అనుమానంతో చూడడం కాదు, విశ్వా సంతో బలోపేతం చేయడం ప్రభుత్వాల బాధ్యత. విద్యా నాణ్యత పేరుతో తీసుకునే ప్రతి నిర్ణయం ఉపాధ్యాయుల మనోధైర్యాన్ని పెంచేదిగా ఉండాలి. దశాబ్దాల సేవ చేసిన గురువును మళ్లీ పరీక్షల ముందు నిలబెట్టడం కంటే, ఆధు నిక బోధనా పద్ధతులపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, డిజిటల్ విద్యలో ప్రావీణ్యం కల్పించడం, కృత్రిమ మేధన్ను ఆధా రిత బోధనా సాధనాల వినియోగంపై అవగాహన కల్పించ డం వంటి చర్యలు విద్యార్థులకు కూడా ఎక్కువ ప్రయోజ నం చేకూరుస్తాయి. విద్యా నాణ్యత అనేది కేవలం పరీక్షల తో పెరగదు.

## పోలవరం దిగువ కాఫర్ డ్యామ్‌లో ఇద్దరు గల్లంతు



**దేవీపట్నం:**

పోలవరం జిల్లా దేవీపట్నం మండలం పోలవరం ప్రాజెక్టు దిగువ కాఫర్ డ్యాం సమీపంలో ఇద్దరు గల్లంతయ్యారు. నదిలో మునిగిపోయిన జేసీబీని బయటకు లాగేందుకు తాడు వేస్తుండగా ఇద్దరు ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. వారిలో ఒకరు ఇంజినీర్ కాగా.. మరొకరు మిషన్ ఆపరేటర్. వారిలో ఇంజినీర్ మృతదేహం లభ్యం కాగా ఏలూరు జిల్లా పోలవరం ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన ఆపరేటర్ కోసం మత్స్యకారులు వలలతో గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తూర్పు గోదావరి జిల్లాలో మళ్లీ పెద్దపులి సంచారం

గోపాలపురం: తూర్పు గోదావరి జిల్లాలో మళ్లీ పెద్దపులి సంచారం కలకలం రేపింది. గోపాలపురం మండలం కరకపాడు, నందిగూడెం, అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. పులి పాదముద్రలను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. పులి మెడకు అమర్చిన రేడియో కాలర్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తున్నారు. పులిని బంధించేందుకు అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. మూడు బృందాలుగా విడిపోయి రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. డ్రోన్లు, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. పెద్ద పులి సంచారంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు అప్రమత్తంగా ఉండాలని మైకుల ద్వారా గ్రామాల్లో అధికారులు ప్రచారం చేస్తున్నారు.



## ఆగస్ట్ 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం..

మెరుగుపరచడమే కాకుండా, ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలను గణనీయంగా పెంచుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అదే సమయంలో పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు కూడా ఇది భారీ ఊతాన్ని ఇస్తుందని వివరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేయనున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు ఉండాలని సీఎం సూచించారు. గిరిజన సంప్రదాయ నృత్యమైన థింసాతో పాటు, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో స్వాగత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. 13 వేల మందితో నిర్వహించే థింసా నృత్యం గిన్నిస్ రికార్డు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు. 11 అంతర్జాతీయ, 25 జాతీయ చానళ్లలో ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అరకు కాఫీతో సహా స్థానిక ఉత్పత్తులు, పర్యాటక ప్రదేశాలకు విస్తృత ప్రచారం కల్పించి, బ్రాండింగ్ చేయాలని కూడా ఆయన ఆదేశించారు.

### భోగాపురానికి మోదీ..

అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని మధ్యాహ్నం 1:05 గంటలకు ప్రధాని మోదీ అక్కడ నుండి తిరుగు ప్రయాణం అవుతారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో భోగాపురం ప్రాంతంలో భారీ భద్రతను ఏర్పాటు చేస్తున్నారు.

## లోక్‌సభ ముందుకు యాంటీ-పేపర్ లీక్ బిల్లు

చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది. ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు ఇప్పటివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ప్రస్తుత సవరణలకు ఆమోదం లభిస్తే.. భాగంగా దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

## డీఎస్సీ ఆరోపణలపై జగన్‌తో బహిరంగ చర్చకు నేను సిద్ధం

దమ్ముంటే చర్చకు రావాలని ఆయన అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్, జగన్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "డీఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు నేను సిద్ధం. ఈ చర్చ కేవలం డీఎస్సీకే పరిమితం కాదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన లిక్కర్, భూ కుంభకోణాలపై కూడా చర్చిద్దాం" అని సవాల్ విసిరారు. 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీది అయితే, ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయని నీచ చరిత్ర జగన్‌ది అని లోకేశ్ ధ్వజమెత్తారు. "వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు. మేము 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే, దాన్ని అడ్డుకోవాలని 150 కేసులు వేశారు. ఆ కేసులన్నీ కోర్టులు కొట్టివేయడమే మా చిత్తశుద్ధికి నిదర్శనం" అని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అభివృద్ధి, సంక్షేమం అయితే.. గొడ్డలి పార్టీ విధానం విధ్వంసం, బూతులు, బాబాయ్‌ను గొడ్డలితో లేపేయడం, తల్లి, చెల్లిని ఇంటి నుంచి తరిమేయడం అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' (సీసీడీ) అనే జబ్బు ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీసుకొచ్చిన ఆర్సెలర్ మిట్టల్, గూగుల్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను తానే తెచ్చానని జగన్ చెప్పుకోవడం ఆయనకున్న జబ్బు లక్షణమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్ల బండిలా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ విజయాలను, వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాలు గెలిచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

### ఎల్ నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కార్యక్రమాలు

అలాగే ఏ ప్రాంతాల్లో ఏయే పంట సాగు చేయాలనేదానిపై రైతులకు వివరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల విషయంలో కొంత గ్యాప్ ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరును చదివి వినిపించినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రంపచోడవరంలో విద్యార్థి శివాని ఆత్మహత్య చేసుకున్న ఘటనను సీఎం చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించారు. చదువులో టాపర్ అయిన శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందని అన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యా శాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. మానసిన పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతోపాటు... టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో.. వాయుగండం

అనేక ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు ఎడతెరిపి లేని వర్షాలతో హిమాచల్ ప్రదేశ్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. జూన్ 30 నుంచి ఇప్పటివరకు వర్ష సంబంధిత ఘటనల్లో 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

**భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం**

వాయవ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా బంగాల్ తీర ప్రాంతాలకు ఆనుకుని ఉన్న అల్పపీడనం శనివారం వాయుగుండంగా వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న 24 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది. అయితే, వర్షాల తీవ్రత దృష్ట్యా కటక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రపారా, జాజ్‌పూర్, ఢెంకనాల్, అంగుల్ జిల్లాలకు అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. అలాగే, ఆయా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు.

**చేపల వేటకు వెళ్లవద్దు!**

మరోవైపు, ఒడిశాలోని మరికొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశంతో ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు జారీ చేశారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశముందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉండటంతో ఒడిశా తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే, మత్స్యకారుల వచ్చే నాలుగు రోజుల పాటు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని ఐఎండీ పేర్కొంది. ప్రస్తుతం ఏర్పడిన వాయుగుండం వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉందని భువనేశ్వర్ ఐఎండీ డైరెక్టర్ మనోరమా మహంతి పేర్కొన్నారు. జులై 27న పరదీప్-సాగర్ దీవి మధ్య తీరం దాటే సమయంలో బలమైన గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

**హిమాచల్ ప్రదేశ్‌లో వరదలు- 15 మంది మృతి!**

ఇదిలా ఉండగా, నైరుతి రుతుపవనాల ప్రభావంతో హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జూన్ 30 నుంచి జులై 26 వరకు వర్షాల ప్రభావానికి దాదాపు 15 మంది ప్రాణాలు కోల్పోయారని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. వీరిలో 13 మంది లాహౌల్-స్పితి జిల్లాకు చెందినవారు కాగా, ఒకరు చంబా జిల్లాకు చెందినవారని తెలిపారు. కాంగ్రా జిల్లాలో ఆకస్మిక వరదలో ఒకరు మృతి చెందినట్లు వెల్లడించారు. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున కొన్ని చోట్ల రహదారులు మూసివేశారు. కొన్నిచోట్ల తాగునీటి సరఫరా వ్యవస్థలకు నష్టం వాటిల్లిందని, ఫలితంగా నీటి సరఫరా నిలిచిపోయిందని, మరికొన్ని చోట్ల విద్యుత్? సరఫరా ఆగిపోయిందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో, జిల్లా యంత్రాంగాలు, రహదారి నిర్వహణ సంస్థలు, విపత్తు ప్రతిస్పందన బృందాలు అప్రమత్తమయ్యాయి. కొండ చరియల శిథిలాలను తొలగించడం, నిత్యావసర సేవలను పునరుద్ధరించడం, ప్రమాదకర ప్రాంతాలను పర్యవేక్షించ డంలో నిమగ్నమై ఉన్నాయి. రానున్న రోజుల్లో రుతు పవనాల ప్రభావం కొనసాగే అవకాశం ఉన్నందున, ముఖ్య ంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న, వరదలకు ప్రభావితమయ్యే ప్రాంతాల్లో నివాసితులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటు అసోంలోనూ వర్షాలు దంచికొడుతున్నాయి.

## కేంద్రం లెక్కల్లో ఏపీ ఘనత..

ఈ గణాంకాలను పార్లమెంటు ముందు ఉంచింది. ఈ లెక్కల ప్రకారం.. 2024-25లో ఏపీలో 1,085.15 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం జతకాగా, 2025-26లో అది అనూహ్యంగా 3,865.63 మెగావాట్లకు చేరింది. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రంగంలో అపూర్వమైన వృద్ధి నమోదైందని, దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న పునరుత్పాదక ఇంధన గమ్యస్థానాల్లో ఒకటిగా ఏపీ నిలిచిందని అధికారిక ప్రకటన పేర్కొంది. గత కొన్నేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఈ పురోగతి స్పష్టంగా కనిపిస్తుంది. 2021-22లో 125.42 మెగావాట్లు, 2022-23లో 148.62 మెగావాట్లు, 2023-24లో కేవలం 59.15 మెగావాట్ల సామర్థ్యం మాత్రమే పెరిగింది. అయితే, 2024-25 నుంచి ఊపందుకుని 1 గిగావాట్ (1000 మెగావాట్లు) దాటిన వృద్ధి, తాజాగా దాదాపు 3.9 గిగావాట్లకు చేరడం రాష్ట్రంలో ఈ రంగం పుంజుకుందనడానికి నిదర్శనం. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, ప్రాజెక్టులకు వేగవంతమైన అనుమతులు, మెరుగైన అమలు, పునరుత్పాదక ఇంధన మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెట్టడం వంటివి ఈ వృద్ధికి కీలక కారణాలని అధికారిక ప్రకటన వివరించింది. ఈ ఏడాది మేలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ' అమలును కూడా వేగవంతం చేసింది. ఈ విధానం కింద 2029 నాటికి పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ నిల్వ, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్, తయారీ రంగాల్లో ఏకంగా రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా కూడా శిలాజయేతర ఇంధన వనరుల నుంచి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ కీలక మైలురాయిని దాటిందని కేంద్రం పార్లమెంటుకు తెలియజేసింది. 2030 నాటికి నిర్దేశించుకున్న 50 శాతం లక్ష్యాన్ని ఐదేళ్ల ముందే సాధించిందని, 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజయేతర ఇంధన ఆధారిత విద్యుత్ సామర్థ్యాన్ని సాధించే దిశగా దేశం పయనిస్తోందని పేర్కొంది. ఈ జాతీయ లక్ష్యాలను చేరుకోవడంలో ఏపీ తన వంతు కీలక పాత్ర పోషిస్తోంది. ఈ రంగంలో భారీ వృద్ధి ద్వారా రాష్ట్రంలో కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు సుస్థిర ఆర్థిక వృద్ధికి మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు.

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ..

నోట్లను ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ఈ ప్రయోగాల్లో భాగంగా రూ. 10, రూ. 20 డినామినేషన్లలో వంద కోట్ల చొప్పున పాలిమర్ నోట్లను ఆర్బీఐ జారీ చేయనుంది. భారతీయ వాతావరణ పరిస్థితుల్లో ఈ నోట్ల మన్నిక, పనితీరును పరిశీలించడమే ఈ క్షేత్రస్థాయి పరీక్షల ప్రధాన ఉద్దేశం. ఈ ప్రయోగాలు విజయవంతమైతేనే, వీటిని దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంపై తుది నిర్ణయం తీసుకుంటారు. అయితే, ప్లాస్టిక్ పాలిమర్ నోట్లను ప్రవేశపెడుతున్నంత మాత్రాన ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దు చేసే ప్రతిపాదన ఏదీ లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగితపు నోట్లతో పాటే పాలిమర్ నోట్లు కూడా సమాంతరంగా చెలామణిలో ఉంటాయని మంత్రి వివరించారు. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉంటాయని, ఇవి సులభంగా పాడవవని ఆర్బీఐ పేర్కొంది. ముఖ్యంగా తక్కువ విలువ కలిగిన నోట్లు త్వరగా చిరిగిపోతుండటంతో, వాటిని తరచూ మార్చాల్సి వస్తోంది. పాలిమర్ నోట్ల వినియోగం వల్ల ముద్రణ మరియు నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

### తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు అభినందనీయం

500 రైసు మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు, సోదరులు శ్రీ నాదెండ్ల మనోహర్ గారు. సామాన్యుడిపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడం స్వాగతించదగినదని చెప్పారు. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్ష చేసి, మిల్లర్లతో అత్యవసరంగా సమావేశం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండేలా మేలైన ధరలను నిర్ణయించారని ఉప ముఖ్యమంత్రివర్యులు తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థికభారాన్ని తగ్గిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

## ఆకివీడు రామాలయానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్..

లేదని పేర్కొంది. ఆలయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌లో బలం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ప్రభుత్వ భూమిలో నిబంధనలకు అనుగుణంగా ఆలయం నిర్మించేందుకు అనుమతి ఇవ్వడంలో తప్పేమీ లేదని వెల్లడించింది. సుప్రీంకోర్టు తీర్పును స్థానికులు, భక్తులు స్వాగతించారు. ఆలయ నిర్మాణ పనులు ఇక వేగం పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ తీర్పు రామభక్తులకు ఆనందాన్ని కలిగించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు హర్షం వ్యక్తం చేశారు. "ఆకివీడులో రామాలయ నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆలయ నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. సత్యం గెలిచింది. ధర్మం గెలిచింది. శ్రీరాముడు గెలిచాడు. జై శ్రీరామ్" అంటూ 'ఎక్స్' వేదికగా స్పందించారు.




తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
మంగళవారం 28 జులై 2026



# హరి మనో వికాస కేంద్రం లో గుడ్ సీడ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు



**అమలాపురం జూలై 27 తెలుగు రాష్ట్రం న్యూస్**

అమలాపురం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరి వైఎస్ విమలారెడ్డి పుట్టినరోజు సందర్భంగా అమలాపురంలో సోమవారం గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అమలాపురం హరి మనో వికాస కేంద్రంలో వికలాంగ విద్యార్థుల మధ్య పుట్టినరోజు కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు బిస్కెట్లు కేక్లు పంపిణీ చేశారు అలాగే పట్టణంలోని పేదలకు ఫుడ్ ప్యాకెట్లను గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు.ఈ కార్యక్రమాలలో మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్,నేలపూడి సుగంధ కుమార్,పందిరి సుబ్బరాజు,నేరేడుమిల్లి శ్రీనివాసరావు,కుంచే అర్జున్,పరమటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల బీమా నమోదును వేగవంతం చేయాలి


## - జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్



**అమలాపురం, జూలై 27, తెలుగు రాష్ట్రం న్యూస్**

ఖరీఫ్ సీజన్‌లో అర్హులైన ప్రతి రైతు పంటల బీమా పథకం కింద నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు (ఎంఏవోలు), రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) సిబ్బందితో సోమవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన పంటల బీమా నమోదు పురోగతిని సమీక్షించారు.జిల్లాలో సుమారు 1.13 లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా ఉండగా, ఇప్పటివరకు 63,467 ఎకరాల్లో (56 శాతం) నాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. రామచంద్రపురం, ఆలమూరు, ఆత్రేయపురం, రావులపాలెం మండలాల్లో 80 శాతానికి పైగా నాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద వరి పంట బీమా నమోదు గడువు ఆగస్టు 15 వరకు ఉన్నప్పటికీ, ఆగస్టు 10 నాటికే వంద శాతం నమోదు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు ఎకరానికి రూ.76 ప్రీమియం చెల్లించి పీఎంఎఫ్‌బీవై యాప్ లేదా రైతు సేవా కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో అరటి సాగు జరుగుతోందని, ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లో అధిక విస్తీర్ణం ఉందని వెల్లడించారు. పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకం కింద అరటి పంట బీమా నమోదు జూలై 31 వరకు కొనసాగుతుందని, ఎకరానికి రూ.3,000 ప్రీమియం చెల్లిస్తే సుమారు రూ.60 వేల హామీ మొత్తం లభిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాలు, తెగుళ్ల వల్ల కలిగే నష్టాలకు రక్షణ ఉంటుందని వివరించారు.కౌలు రైతులు కూడా ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం లేదా సెల్ఫ్ డిక్లరేషన్, బ్యాంకు ఖాతా వివరాలతో రైతు సేవా కేంద్రాల ద్వారా సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, అకాల వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులందరూ గడువు ముగిసేలోగా పంటల బీమా నమోదు చేసుకుని ఆర్థిక రక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో ఆర్టికల్చర్ జెడి బివి రమణ, అగ్రికల్చర్ జెడి ఎం రామారావు జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనార్ధనస్వామి సేవలో రాష్ట్ర బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి




**ఆలమూరు, జూలై27( తెలుగు రాష్ట్రం విలేకరి)**

శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారిని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి సోమవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంత కుమారి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరరం ఆమె ను స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో జితేంద్ర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీనియర్ జర్నలిస్టు మటపర్తి జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# "అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి, బుద్దా లక్ష్మి నారాయణలతో పొలమూరులో బీజేపీ సంస్థాగత సమావేశం"





**అనపర్తి, జులై 27 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**

అనపర్తి మండలం పొలమూరులో అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ సంస్థాగత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా బిజెపి ఇంచార్జ్ బుద్దా లక్ష్మి నారాయణ, జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శులు రజని, ఎంఎస్కే రాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం సంస్థాగత అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత పటిష్టంగా నిర్వహించాలని, బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని నాయకులు దిశానిర్దేశం చేశారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఈ సమావేశంలో తీర్మానించారు.ఈ కార్యక్రమంలో అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి పరిశీలకులు, బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

## -రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వం ఆనందరావు



**అమలాపురం జూలై 27 తెలుగు రాష్ట్రం న్యూస్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, అమలాపురం నియోజకవర్గంలో "2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం"లి పేరిట తలపెట్టిన బృహత్తర ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు సోమవారం ప్రారంభించారు.లి ఉప్పలగుప్తం మండలం, వానపల్లిపాలెం గ్రామంలో ఈ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు గ్రామ వీధుల్లో పర్యటిస్తూ, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, మత్స్యకార వికాసం వంటి సంక్షేమ ఫలాలను మరియు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు.అనంతరం ఎమ్మెల్యే గారు స్థానిక ప్రజల సమస్యలను, వారి సూచనలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. బాధితులు తెలిపిన సమస్యల వివరాలను అక్కడికక్కడే మై టిడిపి యాప్ లో నమోదు చేయించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... "కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ సుపరిపాలన అందిస్తోంది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో మన నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించి, సమస్యలను నమోదు చేయాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్-యూనిట్-బూత్ ఇన్‌ఛార్జ్‌లు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.



# సమగ్ర నీటి సరఫరా మెరుగుదల పథకము



**ముమ్మిడివరం జులై 27 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**

ది.27-07-2026 వ తేది సోమవారం ఉ.గం.11.00 లకు ముమ్మిడివరం నగర పంచాయతి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమగ్ర నీటి సరఫరా మెరుగుదల పథకమునకు (ఏషియన్ ఇంఫ్రాస్ట్రక్షర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకు (AIIB) నిధులు రూ. 191.43 కోట్లతొ చేపట్టబోయే పనికి మరియు (అమృత్ 2.0 నిధులు) రూ.15.91 కోట్లు మరియు ఒక కోటి రూ. ల తొ చేపట్టబోయే వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి శంఖుస్థాపన మరియు మాజీ లోక్ సభ స్పీకర్ జి.ఎం.సి. బాలయోగి గారి విగ్రహావిష్కరణ ను గౌ.శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ శ్రీ దాట్ల సుబ్బరాజు గారిచే ప్రారంబించినారు. అనంతరం జరిగిన సభలో శాసనసభ్యులు వారు మాట్లాడుతూ గతం లో ూ××దీ ప్రాజెక్ట్ ద్వారా 110 కోట్లతో శాంక్షన్ చేయించామని గత ప్రభుత్వం ఆ పథకాన్ని ముందుకు తీసుకువెళ్లలేదని ఇప్పుడు మరలా సుమారు రూ. 206 కోట్లతో దవళేశ్వరం నుండి ముమ్మిడివరం నగర పంచాయతి నకు డైరెక్ట్ పైప్ లైన్ ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుందని ఈ పథకం ద్వారా 5 లక్షల లీటర్ల కెపాసిటి గల 5 ఓవర్ హెడ్ ట్యాంక్ ల నిర్మాణం, 20 వార్డులలో పైప్ లైన్ నిర్మాణం చేపట్టి ప్రజలందరికీ త్రాగు నీరు అందిస్తామని, సుమారు రూ. 3 కోట్లతో సి.సి.రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.రవివర్మ గారు, నియోజక వర్గ పరిశీలకురాలు శ్రీమతి సుంకర పావని గారు, గోలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, గుద్దటి జమ్మి , బి.జే.పి.జిల్లా అధ్యక్షులు వెంకట రెడ్డి, దాట్ల పృథ్వీ రాజు , ఇ.ఇ. రెడ్డి శేషగిరిరావు , డి.ఇ. ఎం.టి.హుస్సేన్ , ములపర్తి బాల కృష్ణ, అర్ధాని శ్రీను , వీళ్ళ వీరాస్వామి నాయుడు, దొమ్మేటి రమణ కుమార్ , పిల్లి నాగరాజు , శ్రీమతి మెండి కమల గారు, శ్రీమతి బొక్క రుక్మిణి , శ్రీమతి వాసంశెట్టి అమ్మాజీ , శ్రీమతి పెదపూడి రుక్మిణి , సరిపెల్ల శ్రీను రాజు , గొల్లపల్లి గోపి , కర్రా దుర్గ ప్రసాద్ , తాడి జానకి రామ్ , దాట్ల బాబు , ఎన్.శ్రినురాజు, ర్యాలి ప్రసాద్, కాశి లాజర్, సానబోయిన సోమయ్య , ప్రజలు , నగర పంచాయతి మరియు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



# కూటమి పాలనలో అభివృద్ధి సంక్షేమం -ఎమ్మెల్యే బండారు



**ఆలమూరు, జూలై27(తెలుగు రాష్ట్రం విలేకరి)**

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి సంక్షేమాన్ని సైతం అందిస్తారనే దృక్పథంతో ప్రజలు అపారమైన నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి 94 శాతం స్ట్రైక్ రేట్ తో అధికారాన్ని అందించారని ఈ రెండేళ్ల పాలనలో ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు వ్యాఖ్యానించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా సోమవారం ఆలమూరు మండలం ఆలమూరు, బడుగువానిలంక గ్రామాల్లో ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, కూటమి నాయకులతో కల్సి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలందరినీ కలుసుకొని, గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. 45 రోజులపాటు కూటమినేతలందరూ ప్రజలను కలుసుకోవాలన్నారు. రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన విజయాలను తెలియజేయాలన్నారు. ఆలమూరు,బడుగువానిలంక గ్రామాల్లో ప్రజల నుంచి అపూర్వమైన స్పందన లభించిందని తెలిపారు.గడిచిన రెండేళ్ల ఎన్డీఏ కూటమి పాలనలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్రయం ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. ప్రజల్ని కలుసుకుని వారితో మాట్లాడినప్పుడు వారు కూటమి పాలన పట్ల సంతృప్తి, సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత రెండేళ్లలో అమలైన సంక్షేమం, గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల గురించి ప్రజలే వివరిస్తున్నారని తెలిపారు. ఏనాడు ఊహించని మెజారిటీలతో ప్రజలు ఎన్డీఏ కూటమిని అధికారంలోకి తెచ్చారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం తన వంతుగా తాను కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. వైసీపీ గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో రాష్ట్రం ఎంతో నష్టపోయిందన్నారు. ఇక ఎన్నటికీ గొడ్డలి పార్టీ అధికారంలోకి రాకూడదనే ఉద్దేశంతో ప్రజలు అపారమైన నమ్మకంతో కూటమికి విజయాన్ని కట్టబెట్టారన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. గ్రామ గ్రామాన జరుగుతున్న అభివృద్ధి, ఇంటింటికి అందుతున్న సంక్షేమం ఇందుకు నిదర్శనం అన్నారు. తాను శాసనసభ్యునిగా ఉన్నప్పుడు బడుగువానిలంకలో నిర్మించిన వంతెనకు పదేళ్ల శాసనసభ్యుడిగా ఉన్న మాజీ శాసనసభ్యుడు కనీసం అప్రోచ్ రోడ్డు కూడా వెయ్యలేకపోయారని విమర్శించారు. మరలా ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాతే బడుగువానిలంక బ్రిడ్జ్ కి అప్రోచ్ రోడ్డు వేసామన్నారు. గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిని,కల్వర్టును వెడల్పు చేసామన్నారు. లంక భూముల నదీ కోత నివారణకు రిలయన్స్ సహకారంతో గ్రోయిన్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గ్రామంలో అనేక మంది రైతులు గోకులాలు నిర్మించుకున్నారన్నారు. రాబోయే కాలంలో పుంత రోడ్ల అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. ఇంకా గ్రామంలో డ్రైన్లు,పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని మహిళలు కోరారని అవన్నీ నెరవేర్చడం జరుగుతుందన్నారు. తల్లికి వందనం పథకంలో భాగంగా ఇంట్లో ఉన్న చదువుకునే ప్రతీ బిడ్డకు రూ.13 వేలు చొప్పున తల్లుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. సామాజిక భద్రతా పింఛన్లలో భాగంగా నెల, నెలా రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు అందిస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు అందించడం జరిగిందన్నారు. గుంతలు లేని రహదారులను అభివృద్ధి చేసామన్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఈదల సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు ఒంటిపల్లి సతీష్, ఈదల నల్ల బాబు, రావాడ సత్తిబాబు,దండంగి మమత,ఈదల రాంబాబు,పాలూరి గోవిందరావు, పడాల వెంకటేశ్వరరావు, దూలం రాంబాబు, ముప్పిరి ఏసు,అన్నందేవుల చినబాబు,మందపల్లి సోమశేఖర్,వెలక్కాయల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోలవరం, పాడేరు, రాయలసీమ ఉభయ గోదావరి జిల్లాలు
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## అన్నా రెడ్డి విజయ్ కుమార్ రెడ్డిని సస్పెండ్ చేయాలనీ జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేసిన సిఐటియు



**కడప జూలై 27 తెలుగు రాష్ట్రం ప్రతినిధి**

కడప కార్పొరేషన్ లో కొందరి కార్మికులను పని గట్టుకొని తీవ్ర ఇబ్బందులకు గురిచేసి, మానసికంగా అవమానకరంగా మాట్లాడుతున్న మున్సిపల్ ఇంజనీర్ అన్నా రెడ్డి విజయ్ కుమార్ రెడ్డి పై విచారించి కఠినమైన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డిలు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి డాక్టర్ నిధి మీనా కు వినతిపత్రం అందజేశారు .ముఖ్యంగా నగరంలో కార్మికులను మాట్లాడని పదజాలంతో దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల పేరుతో కొందరిని పక్కన పెడుతుండడం దుర్మార్గమని తెలిపారు.అనేకసార్లు జిల్లా కలెక్టర్ గారికి, జాయింట్ కలెక్టర్ గారికి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. గతం లో కార్పొరేషన్ కమిషనర్ గా పనిచేసిన భావన గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అని తెలిపారు గతంలో ఎన్ ఎం వర్క్ ఇన్స్పెక్టర్ గా పని చేశారని గుర్తు చేశారు .ప్రస్తుతం ఆర్థిక బలం, ధన బలం తో శాసించే స్థాయిలో ఉన్నారని ఆరోపించారు. వర్క్ ఇన్స్పెక్టర్ గా ఉన్నప్పటి నుంచి ప్రస్తుతం మున్సిపల్ ఇంజనీరుగా ఉన్న పరిస్థితి చూస్తే మాట్లాడే తీరు అసభ్యకరంగా ఉన్నదని తెలిపారు. గతంలో కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో కొందరు ప్రజా ప్రతినిధులు లేవనెత్తారని గుర్తు చేశారు .ఇలాంటి మున్సిపల్ ఇంజనీర్ అన్నా రెడ్డి విజయ్ కుమార్ రెడ్డి పై విచారించి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు .లేకపోతే కార్పొరేషన్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. అప్పటికి పరిష్కారం కాకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉదయ్ అభి లు ఉన్నారు

## రాజ్యాధికారం కోసం యాదవుల సమిష్టి కృషి చేయాలి



**కడప, జూలై 26 తెలుగు రాష్ట్రం ప్రతినిధి:-**

రాష్ట్రంలో యాదవ సమాజం రాజ్యాధికారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని అఖిల భారత యాదవ మహా సంఘం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అఖిలభారత యాదవుల సంఘం జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్నారు. కడప నగరంలోని పాత రిమ్స్ లో గల బీసీ భవన్ లో అఖిల భారతీయ యాదవుల సంఘం జిల్లా అధ్యక్షులు బుర్రి రెడ్డయ్య యాదవును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన యాదవ మహాసభలో పలువురు వక్తలు ప్రసంగించారు. రాష్ట్రంలో రాజ్యాధికారం ఉంటే తప్ప యాదవ సమాజం అభివృద్ధి జరగదని అన్నారు. యాదవులు బీసీ కులాల నన్నిటిని కలుపుకొని పోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలో యాదవుల సంఖ్య అధికంగా ఉన్న జనాభా లెక్కల్లో ప్రభుత్వం ఎంత శాతం అన్న విషయాన్ని సక్రమంగా చూపడం లేదన్నారు. రాష్ట్రంలో యాదవ శాతం అధికంగానే ఉన్నట్లు జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీసీ అందరినీ కలుపుకొని బలీయమైన పోరాటం చేయాలని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పదవులు పొందేందుకు యాదవులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. అధికారం ఉంటే తప్ప ఏమి చేయలేం అనే పరిస్థితిని అందరూ తెలుసుకోవాని చెప్పారు. రాష్ట్రంలో అత్యధికంగా బీసీలు ఉన్న రాజ్యాధికారానికి మాత్రం చాలా దూరంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహా సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లాలో యాదవులందరూ సమిష్టి కృషి తో కలిసి పని చేయాలని కమిటీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అఖిలభారత యాదవ సంఘం అధ్యక్షులుగా బుర్రి రెడ్డయ్య యాదవ్ ను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు పవన్, పులివెందులకు వేములకు సంబంధించిన ఓబుల్ రెడ్డి యాదవ్ పలువురు యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు. నాయకులకు శాలువ కప్పి సన్మానించారు. సభకు యాదవ మహిళలతో పాటు ప్రజలు అధికంగా హాజరయ్యారు.

## ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యత తో నిర్ణీత గడువు లోగా చట్ట పరిధిలో పరిష్కరించాలి

### -జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



**కడప జూలై 27 తెలుగు రాష్ట్రం ప్రతినిధి**

వై.ఎస్.ఆర్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ పాల్గొని, జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 130 ఫిర్యాదులు PGRS కు వచ్చాయి. ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారుపోలీస్ శాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా మా దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాం.లి ప్రజల నుండి అందిన సదరు ఫిర్యాదులను నిర్ణీత సమయంలో చట్ట పరిధిలో పరిష్కరిస్తాం.ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు తమ వినతులను విన్నవించుకున్నారు. వాటిపై సంబంధిత పోలీస్ అధికారులతో జిల్లా ఎస్.పి నేరుగా మాట్లాడి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు.కార్యక్రమం లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్ ) కె. ప్రకాష్ బాబు , స్పెషల్ బ్రాంచ్ డి. ఎస్పీ ఎన్. సుధాకర్ పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు

## రాయలసీమ ప్లీనరీ సమావేశాలు బహిరంగ సభ జయప్రదం చేయండి



**కడప జూలై 27 తెలుగు రాష్ట్రం ప్రతినిధి**

రాయలసీమ ప్లీనరీ సమావేశాలు బహిరంగ సభ జయప్రదం చేయండి రాయలసీమరాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి పిలుపు తరతరాల రాయలసీమకు జరిగే అన్యాయాలను చాటేందుకు పార్టీ ప్లీనరీ సమావేశాలు 22 8 26 శనివారం అనంతపురం ఎన్జీవో మీటింగ్ హాల్ నందు జరుగుతున్నాయని పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కుంచం వెంకటసుబ్బారెడ్డి పిలుపు నిచ్చారు. మేధావులు విద్యావంతులు పోరాట సూర్యులైన సీమ బిడ్డలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ ప్లీనరీ సమావేశాల్లో రాయలసీమకు జరుగుతున్న అన్యాయాలను చాటేందుకు తమ వంతు బాధ్యతగా ఉద్యమాన్ని చేపట్టవలసిన ఆవశ్యకతలను ఈ సమావేశాలను చర్చిస్తున్నట్లు తెలిపారు ఈ సమావేశాలు లో సీమ బిడ్డలమైన మనమందరం పాల్గొని మన భావితరాల వారి జీవితాలను బంగారుమయం చేసుకోవడానికి మన ప్రాంతాన్ని మన సంస్కృతిని సాంప్రదాయాలను రక్షించుకోవడానికి ఉద్యమించాల్సిన అవసరం ఉందని వెంకటసుబ్బారెడ్డి తెలిపారు ఈ బహిరంగ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా తెలియజేశారు

# సమంగా అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యం

### -27 వ డివిజన్ తెదేపా ఇన్చార్జి షేక్ అమానుల్లా





**కడప కల్చరల్,జులై 27తెలుగు రాష్ట్రం ప్రతినిధి**

ఒకవైపు అభివృద్ధి.. మరవేపు సంక్షేమం.. రెండింటికి సమానమైన ప్రాధాన్యత కూటమి ప్రభుత్వానికే సాధ్యమవుతుందని తెలుగుదేశం పార్టీ 27వ డివిజన్ ఇంచార్జ్ షేక్ అమానుల్లా అన్నారు. సోమవారం గౌస్ నగర్ లో ఇంటింటికి వెళ్లి రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం పోస్టర్లను ప్రజలకు అందజేశారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో పల్లెలు,పట్టణాలలో గుంతలమయమైన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు గుంతలు లేని మెరుగైన రోడ్లను నిర్మించారన్నారు. దేశంలోనే పెద్ద మొత్తంలో సామాజిక పెన్షన్లు ఇస్తున్న ఘనత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే దక్కుతుందన్నారు. ప్రపంచ స్థాయి పేరుగాంచిన అనేక పరిశ్రమలు మంత్రి లోకేష్ కృషి ఫలితంగా మన రాష్ట్రానికి వస్తున్నాయని చెప్పారు. 175 నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తయిందన్నారు. రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు.చరిత్రలోనే తొలిసారిగా విద్యుత్ చార్జీలు తగ్గించి ప్రజలపై భారం లేకుండా చేశారని కొనియాడారు. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే అనేక అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు మన రాష్ట్రంలో కొనసాగుతున్నాయని ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని ఆయన కోరారుం



# రాధా రంగా మిత్రమండలి కమిటీని నియమించిన బుల్లెట్ ధర్మారావు



**తిరుపతి,జూలై 27(తెలుగు రాష్ట్రం ప్రతినిధి)**

తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలో రాధా రంగా మిత్రమండలి ఆత్మీయ సమావేశం ఎస్ ఆర్ ఎల్ కళ్యాణ మండపం లో ఘనంగా నిర్వహించినారు.ఈ సందర్భంగా రాధా రంగా మిత్రమండలి నూతన కమిటీని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కీర్తిశేషులు వంగవీటి మోహన రంగా అనుచరులు రాధా రంగా మిత్రమండలి ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు మరియు జనసేన పార్టీ నాయకులు. బుల్లెట్ ధర్మారావు పాల్గొన్నారు . అక్కడ ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు శ్రీకృష్ణదేవరాయలు , వంగవీటిమోహన రంగా చిత్రపటాలకు పూలమాలలు అలంకరించి నివాళులర్పించినారు. అనంతరం కమిటీ సభ్యులు. స్థానిక ప్రజలు బుల్లెట్ ధర్మారావు ను దుశ్యాలువాతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు . ఈ సందర్భంగా బుల్లెట్ ధర్మారావు మాట్లాడుతూ తాను బెంగళూరులోని జనసేన పార్టీ ఆత్మీయ సమావేశమునకు నాయకుల ఆహ్వానం మేరకు పాల్గొని తిరిగి వెళుతూ మార్గమధ్యంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలో రాధా రంగా మిత్రమండలి నూతన కమిటీనీ ఏర్పాటు చేయుటకు ఎప్పటినుండో నన్ను రావాలని వారి కోరిక ప్రకారం ఈ రోజున వెంకటగిరిలో నూతన కమిటీని ఏర్పాటు చేస్తున్నందుకు నాకు ఎంతో సంతోషంగా ఉందని అంతేగాక ఈ నూతన కమిటీలో సభ్యులు కీర్తిశేషులు శ్రీకృష్ణదేవరాయలు వంగవీటి మోహన రంగా ఆశయాలను ప్రజల్లోకి తీసుకుని వెళుతూ పేద ప్రజలకు అండగా ఉంటూ ఈ రాధా రంగా మిత్రమండలి కమిటీని బలోపేతం చేయవలసిందిగా నేను కోరుతూ నాకు మొదటి నుండి సానా ప్రసాద్.(బలిజ ల రిజర్వేషన్ కొరకు పాదయాత్ర చేసిన వ్యక్తి). నాకు అత్యంత ఆప్తుడు, సోదర సమానుడు జనసేన పార్టీ నాయకుడు తోట కిష్టయ్య గారు మరియు గునకల ధనుంజయ మొదటి నుండి నాకు చిరపరిచితులు వీరిని ఈ సందర్భంగా కలిసినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉందని తెలుపుతూ.... రాధా రంగా మిత్రమండలి వెంకటగిరి నియోజకవర్గ అధ్యక్షులుగా.. వయ్యావూరు మణి, ఉపాధ్యక్షులుగా చింతల రాజేష్, కార్యదర్శిగా రామ్ ప్రసాద్ రాయల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా బండి కుమార్, రూరల్ అధ్యక్షులుగా కందుల తిరుపాల్, బాలాయిపల్లి మండల అధ్యక్షులుగా కాసారం వరప్రసాద్, వెంకటగిరి మండల అధ్యక్షులుగా మహేష్,డక్కిలి మండల అధ్యక్షులుగా సంపతి ధనుంజయ రాయల్, మహిళా అధ్యక్షురాలుగా శ్రీమతి శిరీష, నియోజకవర్గ గౌరవ అధ్యక్షులుగా తోట కిష్టయ్య, తిరుపతి నియోజకవర్గ గౌరవ అధ్యక్షులుగా గునకల ధనుంజయ లను నియమించి వారందరికీ బుల్లెట్ ధర్మారావు చేతుల మీదగా నియామక పత్రములను అందజేసినారు.. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో శ్రీకృష్ణదేవరాయలు రంగా గారి అభిమానులు,మెగా ఫ్యామిలీ అభిమానులు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# రంపచోడవరంలో విద్యార్థి ముర్రం శివానీ ఆత్మహత్య...

### -మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ లో ముఖ్యమంత్రి ప్రశంసలు పొందిన శివానీ..-భౌతికకాయానికి నివాళ్ళులు అర్పించిన ఎమ్మెల్యే,ఎస్టీ కమిషన్ చైర్మన్..-విద్యార్థిని శివాని మృతి తీవ్ర విచారం కలిగించింది : ముఖ్యమంత్రి చంద్రబాబు



**రంపచోడవరం,జూలై 27(గోదావరి ప్రతినిధి):**

రంపచోడవరంలో 10వ తరగతి చదువుతున్న ముర్రం శివానీ ఆమె స్వగృహంలో ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకుని మరణించింది. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రంప చోడవరం మెగా పేరెంట్ -టీచర్స్ మీటింగ్ లో భాగంగా ఆమె వాక్చాతుర్యంతో ప్రశంసలు పొందిన గిరిజన విద్యార్థిని ముర్రం శివానీ(15సం") ఇకలేరు. ఆమె వారి స్వగృహంలో ఉరి వేసుకుని మరణించారు. ఇంతలోనే అనంతలోకాలకు వెళ్ళిన ఆమె మృతిపై తలిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు.ఆమె మరణవార్త విన్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని శివానీ తల్లిదండ్రులైన వర ప్రసాద్,సౌభాగ్యవతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గిరిజన విద్యార్థిని మృతిపై ఆమె తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.అలాగే ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జి రెడ్డి రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి చేరుకుని శివానీ ఆత్మహత్య కు గల కారణాలు తెలుసుకొని ఆమె మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.అలగే తల్లితండ్రులను పరామర్శించి మనోధైర్యంగా ఉండాలని కోరారు.ఆమె భౌతిక కాయనికి ఎమ్మెల్యే,ఎస్టీ కమిషన్ చైర్మన్ నివాళ్ళులు అర్పించారు. ఇంతవరకు మనతో ఉన్న శివానీ మనతో లేదు అన మరణ వార్త విన్న తోటి విద్యార్థులు కన్నీటిపర్వతమయారు.శివానీ ఆత్మహత్య కు గల కారణాలు అన్ని కోణాల్లో వెలికితీసి తగిన దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు. పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన శివాని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆ రోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి.



ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవ్వడం నన్ను కలిచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవ్వరూ ఒత్తిడికి, నిరాశ, నిస్పృహలకులోను కావొద్దని కోరుతున్నాను. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధను, ఆవేదనను మీ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని, అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని తెలియజేశారు.



## ముంపులో ఉన్న గ్రామాలకు నష్ట పరిహారం, ప్యాకేజీ ఇప్పించండి



**కూనవరం జూలై 27 ( తెలుగు రాష్ట్రం విలేకరి )**

పోలవరం జిల్లా,కూనవరం మండలంలో ఉన్న 10 గ్రామాల ప్రజలకు 41 కాంటూర్ లో ఉన్న భూములు నీట మునుగుతున్నాయని కాని వాటికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడంలేదని మండల సీపీఎం మండల కమిటీ తరపున పేర్కొన్నారు. ఈ సందర్భంగా రంపచోడవరం జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే 10 గ్రామాల ప్రజలకు పోలవరం ప్రాజెక్ట్ ముంపు భూమి నష్ట పరిహారం అందించాలని కోరారు.అలాగే భీమవరం సబ్ స్టేషన్ నుండి బురద గూడెం వరకు ఆర్ అండ్ బీ రోడ్డు మీదుగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు.వరద లు వచ్చినపుడు 5పంచాయితీ లకు విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆర్ అండ్ బీ రోడ్డు మీదుగా విద్యుత్ లైన్ ఇస్తే సమస్య పరిస్కారమౌతుందని అన్నారు.అలాగే వరదల సమయంలో అత్యవసర పరిస్థితి లో భద్రాచలం వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారని బురద గూడెం నుండి చింతూరు మండలం తుమ్మల వరకు రోడ్డు.నిర్మాణం చేపట్టాలని కోరారు. వాటికి సంబంధించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ అమ్మజి, నాగమణి,సోడె శంకర్ ఎంపీటీసీ జయసుధ జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు,తమ్మయ్య, ఉయిక కన్నయ్య,తొండ లక్ష్మయ్య, భూమయ్య కన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## "రంగంపేటలో ఇంటింటికీ తెలుగుదేశం కాంపెయిన్ - కూటమి ప్రభుత్వ పథకాలు వివరించిన టీడీపీ నేతలు"

**రంగంపేట, జులై 27 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా రంగంపేట మండలం రంగంపేట గ్రామంలో డోర్ టు డోర్ కాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి గవర్నమెంట్ హాస్పిటల్ ఎణా నెంబర్, రంగంపేట గ్రామ తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇంచార్జ్ యలమాటి రాంబాబు, రంగంపేట గ్రామ టీడీపీ అధ్యక్షులు పోతుల వీర వెంకట సత్యనారాయణ, గ్రామ సీనియర్ టీడీపీ నాయకులు ఉండవల్లి గంగాధరం, గ్రామ మాజీ ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు పాల్గొన్నారు. అదేవిధంగా 128వ బూత్ టీడీపీ ఇంచార్జ్ ఉండవల్లి రవిశంకర్, గ్రాజూ అధ్యక్షులు గారపాటి రాంబాబు, 127వ బూత్ టీడీపీ ఇంచార్జ్ నిమ్మలపూడి వీర వెంకట సత్యనారాయణ, సోషల్ మీడియా ఇంచార్జ్ అనిల్, రంగంపేట జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ చైర్మన్ గెద్దాడ దుర్గారావు తో పాటు చీణూ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని నమోదు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న మంచిని ప్రతి గడపకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు



కుందుర్పి జులై 27 తెలుగు రాష్ట్రం విలేఖరి.

కుందుర్పి మండలం కెంచంపల్లి గ్రామంలో ఇంటింటా తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే అమ్మినేని సురేంద్రబాబు సూచన మేరకు ఇంటింటా తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు 45 రోజులు పాటు జరగనున్న ఇంటింట తెలుగుదేశం ఈరోజు ప్రారంభించారు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం చేపట్టిన తల్లికి వందనం 13,000 మరియు వికలాంగుల పింఛన్ 6000, డప్పు కళాకారుల పింఛన్ 3000, వితంతువు పింఛన్ 4000, ప్రతి దాతకు అందాయో లేదు తెలుసుకున్నారు. మరియు ప్రతి గ్రామంలో సిసి రోడ్లు కావచ్చు, నీటి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఏవైనా సమస్యలు ఉంటే ఎమ్మెల్యే గారిచే మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని కొనియాడారు. మరియు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన సొంత నిధులతో 9వ పదవ తరగతి విద్యార్థులకు ఉచిత సైకిల్లో రూ 6500 సైకిల్లు 4 కోట్ల రూపాయలు ఖర్చుతో విద్యార్థులకు త్వరలోనే అందజేస్తారని వివరించారు మరియు పిఎం కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ రైతులను అడిగి తెలుసుకున్నారు.. ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు తెలుగుదేశం పార్టీ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రెటరీ లి+.రవి , తెలుగుదేశం పార్టీ పంచాయతీ కన్వీనర్ కే. లింగయ్య, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ వి. సంజీవయ్య, పంచాయతీ ప్రధాన కార్యదర్శి ఐ. గోపాల్, గ్రామ తెలుగు యూత్ లీడర్స్ టి. రఘు, టి. మంజునాథ్ మాజీ స్టోర్ డీలర్, బిఎల్ఎ కే. రామాంజనేయులు, స్టోర్ డీలర్ సురేష్, మాజీ అని మీటర్ వీ.సంజీవయ్య, సుబ్బరాయుడు, శ్రీ శ్రీనివాసులు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత మాజీ రాష్ట్రపతి, "మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా" డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

జగ్గయ్యపేట, జూలై 27 (తెలుగురాష్ట్రం విలేకరి):




భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, భారత రత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారి వర్ధంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ కలాం భారతదేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచ వేదికపై నిలబెట్టిన మహానుభావుడని కొనియాడారు. దేశ యువతకు పెద్ద కలలు కనాలని, వాటిని కృషితో సాకారం చేసుకోవాలని ప్రేరణనిచ్చిన గొప్ప వ్యక్తిగా ఆయనను స్మరించారు. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ తన ప్రతిభ, కృషి, క్రమశిక్షణతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించి కోట్లాది భారతీయులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. దేశ రక్షణ రంగంలో క్షిపణి సాంకేతికత అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. "దేశం ముందు -- వ్యక్తి తర్వాత" అనే భావనతో నిరంతరం దేశాభివృద్ధి కోసం పనిచేసిన డాక్టర్ కలాం ఆశయాలను ప్రతి భారతీయుడు ఆచరణలో పెట్టాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ అభివృద్ధి చెందిన, స్వావలంబన భారత్ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు యంపోగు రాజా, యన్ టి ఆర్ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి మన్నె మాధవి, పట్టణ ప్రదాన కార్యదర్శులు వల్లపునేని గోవిందరావు, కంభాల గోపి, పట్టణ యువ మోర్చా అధ్యక్షుడు తోట గోపి, పట్టణ ఆర్ టి ఐ సెల్ కన్వీనర్ నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా లాక్కున్న భూమిని తిరిగి ఇప్పించండి

### - రంపచోడవరం జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ కి వినతి పత్రం




కూనవరం జూలై 27 ( తెలుగు రాష్ట్రం విలేకరి)

పోలవరం జిల్లా,కూనవరం, పైడ్ గూడెం గ్రామం లో ఉన్న భూమి 23 ఎంసీ సర్వేలో ఉన్న తమ భూమిని తమకి అందించి న్యాయం చేయాలని రంపచోడవరం జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ ని కలిసి జగ్గవరం గ్రామానికి చెందిన సవలం రాజమ్మ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైడిగూడెం గ్రామంలో 23ఎం. సీ సర్వేలో ఉన్న భూమిని పొడియం అప్పారావు జామయిల్ తోట వేసి ఆక్రమించుకున్నాడని తెలియజేసింది. తమ తండ్రి కనకయ్య 7ఎకరాలు పోడు భూమి ఉందని ఆ భూమిని అప్పారావు ఆక్రమించి నీ దిక్కున్న చోట చెప్పొకొమ్మని అంటున్నాడని తెలిపింది. తమ దగ్గర ప్రభుత్వం పంచిన ఆధారాలు ఉన్నాయని తమ భూమి తమకు ఇప్పించాలని కోరింది..

## 1/70 చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు మరోవైపు ఆదివాసులపై గిరిజనేతరుల దాడులు ఆదివాసులకు రక్షణ ఎక్కడ

### -జిల్లా కమిటీ సభ్యులు బాబు బౌర్రయ్య

కూనవరం జులై 27 ( తెలుగు రాష్ట్రం విలేకరి)



ఆదివాసి గిరిజనులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ 2ఏ భూమిపై గిరిజనేతరులు అక్రమంగా జోక్యం చేసుకుని ఆదివాసులపై దాడికి పాల్పడడం అత్యంత దుర్మార్గమైన చర్య. ఈ ఘటనను ఆదివాసి గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తోంది.ఒకవైపు పాలక ప్రభుత్వాలు షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసుల భూములను రక్షించే 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తుండగా, మరోవైపు గిరిజనేతరులు ఆదివాసులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదివాసులకు రక్షణ ఎక్కడ? అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం.పేసా చట్టం, ఐదవ షెడ్యూల్ రాజ్యాంగ పరిరక్షణలు అమల్లో ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా గిరిజనేతరులు ఆదివాసుల భూములపై హక్కులు ఉన్నట్లుగా వ్యవహరించడం చట్టవిరుద్ధం. ప్రభుత్వ 2ఏ భూమిపై గిరిజనేతరులకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కు లేదు.ఈ దాడిలో గాయపడిన ఆదివాసి గిరిజనులకు ప్రభుత్వం వెంటనే మెరుగైన వైద్యం అందించి, పూర్తి రక్షణ కల్పించాలి. అలాగే దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద వెంటనే కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి.షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసుల రాజ్యాంగబద్ధ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. భూములు, జీవన హక్కులు, గౌరవాన్ని రక్షించడంలో ప్రభుత్వం విఫలమైతే ఆదివాసి గిరిజన సంఘం ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఆదివాసి గిరిజన సంఘంగా హెచ్చరించారు.

# ప్రధాని నరేంద్ర మోడీని ఒప్పించి బీసీలకు రిజర్వేషన్ సాధిస్తాం-పోరాడతాం

## -కృష్ణాజిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గూడవల్లి కృష్ణార్జున రావు




పెడన,జూలై 27(తెలుగు రాష్ట్రం ప్రతినిధి)

ఓ బి సి జాతీయ సెమినార్ తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించినది.పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50% రిజర్వేషన్లు కల్పించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ-ప్రజాస్వామ్యంలో అన్ని కులాలకు జనాభా ప్రకారం వాటా ఇవ్వాలి. అలాగే బీసీ బిల్లు పెడితేనే మహిళా బిల్లు బీసీ మహిళలకు సబ్ కోటా వస్తుంది. స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు కల్పించి విధంగా రాజ్యాంగ సవరణ చేయాలి. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక ప్రభుత్వ శాఖ ఏర్పాటు చేయాలి విద్య ఉద్యోగ ఆర్థిక అభివృద్ధి కి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. ఈ మేరకు రాజ్యాంగాన్ని సవరణ చేయాలి. జనాభా ప్రకారం బిసి రిజర్వేషన్లు పెంచాలి. ఎస్సీ ఎస్టీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఉన్నవి. అలాగే బీసీలకు కూడా విద్య ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లు జనాభా ప్రకారం ఉండే విధంగా రాజ్యాంగాన్ని సవరణ చేయాలి. బీసీలకు రక్షణ చట్టం కల్పించాలి. బీసీ కులాల్లో చాలా కులాల్లో ఇప్పటికీ దాడులు దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయి. కులాల పేరు మీద అగౌరవంగా దూషిస్తున్నారు. అవమాన పరుస్తున్నారు. ఎస్సీ ఎస్టీ యాక్ట్ తెచ్చిన తరువాత దళితుల మీద దౌర్జన్యాలు తగ్గాయి. కావున బిసి లకు రక్షణ చట్టం ఏర్పాటు చేసి దాడులు దౌర్జన్యాలు జరక్కుండా అరికట్టాలి. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మాదిరిగా అన్ని రాష్ట్రాల్లో బీసీ హాస్టల్స్ (గురుకులాలు), స్కాలర్షిప్ స్కీమ్, ఫీజుల రియంబర్స్మెంట్ స్కీమ్, ప్రవేశపెట్టి బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య, వృత్తి విద్య కోర్సులలో ఉచిత విద్యను అందించాలి. కేంద్ర ప్రభుత్వం గతంలో రెండుసార్లు ప్రకటించిన విధంగా మాట ప్రకారం వచ్చే జనగణనలో కుల గణన చేపట్టాలి. సుప్రీంకోర్టు హైకోర్టు జడ్జిల నియామకాల లో బీసీ ఎస్సీ ఎస్టీలకు జనాభా ప్రకారం కోటా ఇవ్వాలి. ఈమేరకు రాజ్యాంగాన్ని సవరణ చేయాలి. బీసీల విద్యా ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్నక్రిమిలే యర్ నిబంధన తొలగించాలి. కేంద్ర బడ్జెట్లో వివిధ బీసీ పథకాలకు స్కాలర్షిప్లకు మిగతా పథకాలకు బడ్జెట్ 2500 కోట్ల నుంచి, రెండు లక్షల కోట్లు పెంచాలి. కేంద్ర స్థాయిలోబిసి సబ్ ప్లాన్ పథకాన్ని ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గూడవల్లి కృష్ణార్జునరావు సభలో ఉపోద్ఘాటించారు. కృష్ణాజిల్లా నుంచి కృష్ణా జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గూడవల్లి కృష్ణార్జునరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు బుర్ర కాశీ విశ్వేశ్వరరావు వేముల వెంకటప్రసాద్ పిచ్చక ప్రసాద్ సురగని బ్రహ్మం, పెడన నియోజకవర్గ అధ్యక్షులు వీరంకి శ్రీనివాసరావు, టౌన్ బల్ల సాంబశివరావు జిల్లా నాయకులు తాతా విటల్, మోక రామకృష్ణ ,బంగార్రాజు , బుర్ర ఏడుకొండలు రజిని బుర్ర ఝాన్సీరాణి మోకా దుర్గా నాగజ్యోతి తదితర బీసీ నేతలు పాల్గొన్నారు.



# ముత్యాలపల్లిలో జిల్లా పరిషత్ హైస్కూల్లో కంప్యూటర్ ల్యాబ్

## -ప్రారంభించిన ఎమ్మెల్యే నాయకర్

మొగల్తూరు జూలై 27, (తెలుగు రాష్ట్రం విలేఖరి):

మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలోని శ్రీ బండి ముత్యాలమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు హై స్కూలుకు విరాళంగా అందించిన కంప్యూటర్లను విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే నాయకర్ ప్రారంభించారు.మరియు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, నేటి వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి అత్యంత అవసరమని అన్నారు. విద్యతో పాటు కంప్యూటర్ నైపుణ్యాలను కూడా అలవర్చుకుంటే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావాలని ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కంప్యూటర్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు డిజిటల్ విద్యను మరింత సమర్థవంతంగా అభ్యసించే



అవకాశం లభిస్తుందన్నారు.పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు కలిసి సుమారుగా 5 లక్షల రూపాయలు ఖరీదైన కంప్యూటర్లను విరాళంగా అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. సమాజం భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయవచ్చని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంప్యూటర్ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంలో రాణించి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం పాఠశాలలోని డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పరిశీలించి, అక్కడ విద్యార్థులకు అందుతున్న సాంకేతిక ఆధారిత బోధన విధానంపై వివరాలు తెలుసుకున్నారు. ఆధునిక విద్యా సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు పెనమత్స రామరాజు , గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం సత్యనారాయణ, బిజెపి, టిడిపి , జనసేన నాయకులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం

## - హోం మంత్రి మంత్రి వంగలపూడి అనిత



పాయకరావుపేట, జులై 27 : (తెలుగు రాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం మండలంలోని పాల్మన్ పేటలో పర్యటించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళ పూర్తి అయిన సందర్భంగా "రెండేళ్ళ నమ్మకం, అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన అనితకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగున హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాల్మన్ పేట గ్రామంలో మంత్రి అనిత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ... రెండేళ్లలోనే పాయకరావుపేట నియోజకవర్గంలో 1100 వందలు కోట్లకు పైగా అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టామన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. నక్కపల్లి స్టీల్ ప్లాంట్ ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపామని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని హోం మంత్రి అనిత తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ మత్స్యకార యువ నాయకుడు మైలపల్లి అశోక చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోట నగేష్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియం కేరీ, శ్రీ పాండురంగ స్వామి దేవస్థానం ఛైర్మన్ మజ్జూరి నారాయణరావు, పార్టీ మండల ప్రెసిడెంట్ చించలపు ప్రదీప్ (పద్దు), టౌన్ ప్రెసిడెంట్ యాళ్ళ వరహాలబాబు, శ్రీ పాండురంగ స్వామి దేవస్థానం డైరెక్టర్ అనుముకొండ శ్రీదేవి, పార్టీ సీనియర్ నాయకులు గొర్రెల రాజబాబు, గూటూరు శ్రీనివాసరావు, గోసల శ్రీకాంత్, గరికిన రమణ, కందాల సత్యనారాయణ, కందాల జగదీష్, గరికిన గోవిందు, మైలపల్లి తాతారావు, పిక్కి గోపి, వై మహేష్, చింతకాయల నాగరాజు, ఎరిపిల్లి కొండబాబు, మైలపల్లి కోటేష్, కందాల ప్రసాద్, చవ్వాకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# "ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంపై రంగంపేట టీడీపీ నాయకులకు ఆళ్ల గోవిందు దిశానిర్దేశం'



'రంగంపేట, జులై 27 (తెలుగు రాష్ట్రం విలేఖరి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగంపేట తెలుగుదేశం పార్టీ నాయకులతో రంగంపేట టీడీపీ ఇంచార్జ్ ఆళ్ల గోవిందు ఆత్మీయ సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆళ్ల గోవిందు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు.ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకోవాలని, వాటిని పుస్తకంలో నమోదు చేసి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేందుకు కృషి చేయాలని ఆళ్ల గోవిందు నాయకులకు దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న మంచిని ప్రతి గడపకు తీసుకెళ్లడమే "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని, పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో రంగంపేట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రెండేళ్ల నమ్మకం...అభివృద్ధి-సంక్షేమం!

## -మండల పార్టీ అధ్యక్షులు ధనుంజయ ఆధ్వర్యంలో రుద్రంపల్లిలో ఇంటింటికి టీడీపీ!



కుందుర్పి జులై 27 తెలుగు రాష్ట్రం విలేకరి

, కుందుర్పి మండల వ్యాప్తంగా కళ్యాణదుర్గం శాసనసభ్యులు సురేంద్రబాబు ఆదేశాల మేరకు. టీడీపీ ఇంటిటికి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా, రుద్రంపల్లి గ్రామంలో నిర్వహించిన, ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకొన్న సందర్భంగా, టీడీపీ ప్రతిష్టత్మాకంగా నిర్వహిస్తున్న, రెండేళ్ల నమ్మకం...సంక్షేమం, అభివృద్ధి గురుంచి గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి టీడీపీ నాయకులు ప్రజలకు క్లుప్తంగా వివరిస్తున్నారు. అదేవిధంగా, మై-టీడీపీ యాప్ లో నమోదు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎనుమలదొడ్డి టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షులు గంగన్న, కుందుర్పి మండల, టీడీపీ అధ్యక్షులు +.ధనుంజయ, సింగల్ విండో ప్రెసిడెంట్ చిత్రలింగప్ప, మండల ౦ష సెల్ అధ్యక్షులు వెట్టి హనుమంతరాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు ప్రసాద్, రామాంజినేయులు, సన్నప్ప, రాము, దురుగన్న, మారెన్న, సీగలపల్లి బాబు, వా.మల్లాపురం రామచంద్ర, జంబుగుంపల రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి మండల అధ్యక్షుడు నాగరాజు పుట్టినరోజు వేడుకలు

## -నాగరాజుతో జన్మదిన కేక్ కట్ చేస్తున్న-ఏఎంసీ చైర్మన్ శ్రీమన్నారాయణ,



మొగల్తూరు జూలై27,(తెలుగు రాష్ట్రం విలేఖరి):

మొగల్తూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ జడ్పీటీసీ గుబ్బల నాగరాజు 56వ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సోమవారం ఉదయం ఆయన శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న అమ్మవారి ఆశీర్వాదం పొందేరు. సాయంత్రం 6 గంటలకుమొగల్తూరు తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, రాష్ట్ర తెలుగుదేశం ఆర్గనైజింగ్ కార్యదర్శి కొప్పాడి రవీం ద్రనాథ్ ఠాగూర్,లతో పాటు జనసేన తెలుగుదేశం పార్టీలకు చెంది పలురువు ప్రముఖులు నాయకులు పాల్గొని నాగరాజుతో కేక్ కట్ చేయించి అభిమానులకు పంచారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాగరాజు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ లోనే కొనసాగుతూ జడ్పీటీసీగా రెండు పర్యాయాలుగా మండల తెలుగుదేశం అధ్యక్షుడుగా కొనసాగుతూ కార్యకర్తలకు అండగా ఉన్నారన్నారు. మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని రానున్న రోజుల్లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ నిప్పులేటి తారకరామారావు, మత్యకార సొసైటీ అధ్యక్షుడు మోకా ఏడుకొండలు, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు బొల్లా చంటి, కొమ్మిరిశెట్టి వాసు, పాలా రాంబాబు, కలిదిండి కుమార్ బాబు, కత్తిమండ ముత్యాలరావు, వెలిది పుల్లారావు, ముక్కు పుల్లయ్య నాయుడు, మెండి రాజేష్, మైలాబత్తుల రాంబాబు, కవురు నాగేశ్వరరావు, దేశంశెట్టి శ్రీను, పంపన భగవాన్, పీతాని శేఖర్, చెల్లుబోయిన పెద్దిరాజు, కడలి చంటేశ్వరరావు, కొల్లాటి బోగరాజు, పెంకే రామకృష్ణ, నర్సింహరావు, గుబ్బల కృష్ణ, పిఎంఏ రాజు, పెచ్చెట్టి నాగేశ్వరరావులతో పాటు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొగల్తూరులో రహదారిపై బిక్షాటన చేస్తున్న దస్తావేజు లేఖర్లు.

## -వినూత్న నిరసన తెలిపిన దస్తావేజు లేకర్లు.





మొగల్తూరు జూలై27,(తెలుగు రాష్ట్రం విలేఖరి):

ప్రభుత్వ ఆస్థులు కాపాడాలి, దస్తావేజు లేకర్ల ఐఖ్యత వర్ధిల్లాలి, ప్రభుత్వం తమకు విరుద్ధంగా విడుదల చేసిన 369 జివో రద్దు చేయాలని కోరుతూ సోమవారం దస్తావేజు లేకర్లు మొగల్తూరులో బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. స్థానిక పెద్దమిల్లు సెంటర్ నుండి గాంధీబొమ్మల సెంటర్ వరకూ బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. రహదారి వెంబడి వెళ్ళుతున్న ప్రయాణీకులను, వాహనాలు ఆపి వారి ఆవేదనను తెలియపరుస్తూ తమకు మద్దతు పలకాలని కోరారు. ఈ నిరసనలో దస్తావేజు లేఖర్లు కొల్లాటి వెంకటేశ్వరరావు, శీలబోయిన సత్యనారాయణ, కడలి చంద్రశేఖర్, పులపర్తి వెంకటేశ్వరరావు, కడలి త్రిమూర్తులు, ముక్కు రాజబాబు, పట్టపు రాము, ఆదూరి సత్యనారాయణ, గుండు నాగేంద్ర, మోకా హేమ్మ, చిట్టిబోయిన శైలజ, వాసర్ల రవి, కడలి రాజశేఖర్, పులపర్తి నాగేశ్వరరావు, బొక్కా ఎడుకొండలు, యాతం తులసీరామ్ము పాల్గొని తమ సమస్య పరిష్కారం అయ్యే వరకూ ఆందోళన కొనసాగిస్తామన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎఐటియుసి ధర్నా



తాడేపల్లిగూడెం, జులై 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గ్రామ పంచాయతీ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి అనుబంధ ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ మరియు స్వచ్ఛ భారత్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిగూడెం ఎంపిడిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఐటియుసి ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వృత్తి భద్రత, సమాన పనికి సమాన వేతనం, రూ.26 వేల కనీస వేతనం, వారాంతపు సెలవు అమలు చేయాలని కోరారు.ఏరియా కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ రూ.5 వేల జీతంతో కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ట్రెజరీ ద్వారా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ నెలల తరబడి జీతాలు ఆలస్యం చేయడం సరికాదని, పంచాయతీ కార్మికుల పోరాటానికి తమ సంఘం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ టి సి ఏరియా సమితి కార్యదర్శి మందలపర్తి హరీష్, కార్యనిర్వాహక కార్యదర్శి కే లక్ష్మీనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం కాటమరాజు, ఉప్పాటి నాగరాజు, మండెల్లి రామకృష్ణ, ప్రాంతీయ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు తలకాయల సతీష్ కుమార్, తాడేపల్లి గాంధీ, ముప్పిడి మునసబు, సిగిరిపల్లి గన్నయ్య, నూతంగి ఏసు రాజు, తానేటి వెంకటరావు, కోనా సతీష్, భవిరిశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొని కార్యక్రమానికి ముందు కార్మికులు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఓ వి.చంద్రశేఖరం కు వినతిపత్రం అందజేశారు. సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఎంపిడిఓ హామీ ఇచ్చారు.పెంటపాడులో: ఎఐటియుసి రాష్ట్ర పిలుపు మేరకు పెంటపాడు ఎంపిడిఓ కార్యాలయం వద్ద కూడా గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా చేసి ఎంపిడిఓ పి.వి.వి.ఎస్. రామ్ ప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు.

# పదిసంవత్సరాల ఆధ్యాత్మిక దీక్షకు నిదర్శనం 11వ సంవత్సరం పరిపూర్ణ కాశీరామేశ్వరం యాత్ర

## -పూర్తి చేసిన భక్తుడు తోరాటి శ్రీను





కోరుకొండ జులై 27 ( తెలుగు రాష్ట్రం ప్రతినిధి) తూర్పుగోదావరి జిల్లా

కోరుకొండ మండలం గాడారాడ గ్రామానికి చెందిన భక్తుడు తోరాటి శ్రీను తన ఆధ్యాత్మిక జీవితంలో అరుదైన ఘట్టాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. వరుసగా పది సంవత్సరాల పాటు కాశీ రామేశ్వరం పవిత్ర యాత్రను ఆచరిస్తూ, 11వ సంవత్సరంలో పరిపూర్ణ కాశీ రామేశ్వరం యాత్రను పూర్తిచేసుకునిస్వగ్రామానికి చేరుకున్నారు. ఈ పవిత్ర యాత్ర విజయవంతంగా పూర్తైన సందర్భంగా కనుపూరు గ్రామంలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ కొండపై మహా అన్నసమారాధనను అత్యంత వైభవంగా నిర్వహించారు.కాశీ రామేశ్వరం పరిపూర్ణ యాత్ర హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక సాధనగా భావిస్తారు. ఉత్తర భారతదేశంలోని కాశీ విశ్వనాథుని దర్శించి, అక్కడి గంగాజలాన్ని దక్షిణ భారతదేశంలోని రామేశ్వరంలో శ్రీ రామనాథస్వామికి సమర్పించడం ద్వారా ఈ యాత్రపరిపూర్ణమవుతుందని పురాణాలు వివరిస్తాయి. వరుసగా పది సంవత్సరాల పాటు ఈ పవిత్ర యాత్రను భక్తిశ్రద్ధలతో కొనసాగించి, 11వ సంవత్సరంలో పరిపూర్ణ యాత్రను పూర్తి చేసి గంగా యమునా సరస్వతి త్రివేణి సంగమం పవిత్ర గంగాజలాన్ని తెచ్చి ఎక్కడ భక్తులకు అందించారు.యాత్ర ముగించుకుని స్వగ్రామానికి చేరుకున్న తోరాటి శ్రీనుకి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కనుపూరు శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు భక్తిపూర్వకంగా జరిగాయి.తన మొక్కు నెరవేరిన సందర్భంగా భక్తుడు తోరాటి శ్రీనుఆలయ కొండపై మహా అన్నసమారాధన నిర్వహించి సోమవారం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందించారు. “అన్నదానం మహాదానం” అనే భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలాకులమతాలకు అతీతంగా వచ్చిన ప్రతి భక్తునికి ప్రేమతో అన్నప్రసాదం వడ్డించడం విశేషంగా నిలిచింది. తోరాటి శ్రీను మాట్లాడుతూ, ఈపరిపూర్ణకాశీ రామేశ్వరం యాత్రను విజయవంతంగా పూర్తి చేయడానికి పరమేశ్వరుని అనుగ్రహం, పెద్దల ఆశీస్సులు, కుటుంబ సభ్యుల సహకారం ఎంతో దోహదపడ్డాయని యాత్ర విజయవంతంగా పూర్తయిన ఆనందంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రతి ఒక్కరూ భగవంతుని ఆశీస్సులతోసుఖశాంతులతోజీవించాలనికోరుకుంటున్నాను అని తెలిపారు.ఈ మహా అన్నసమారాధన కార్యక్రమంలో గాడారాడ, కనుపూరు గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు,బంధుమిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదం, అన్నప్రసాదం పంపిణీ చేసి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల నడుమ ముగించారు



# కెనరా బ్యాంకు అధికారుల తీరును నిరసిస్తూ ఒంటిపై డీజిల్ పోసుకొని దంపతుల ఆత్మహత్యాయత్నం..



కుందుర్పి జూలై 27 తెలుగు రాష్ట్రం విలేఖరి.

కుందుర్పి మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మందలపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ, నాగేంద్ర దంపతులిద్దరూ ఒంటిపై డీజిల్ పోసుకొని కెనరా బ్యాంకు ముందు ఆత్మహత్యాప్రయత్నం చేశారు. సకాలంలో రైతులు దంపతులను నిలువరించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ.. తమ మామ చేసిన పంట రుణాల అప్పు తీర్చాలంటూ బ్యాంక్ అధికారులు తమ ఖాతాలను ఓల్డ్ లో పెట్టారన్నారు. ఐదు రోజుల క్రితం తమ కుమారులు ఇద్దరి మంజూరైన తల్లికి వందనం నగదు డ్రా చేసుకోకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు మేనేజర్ ని ఎన్నిసార్లు బతిమాలాడిన పట్టించుకోలేదని, బ్యాంకు బయటకు వెళ్ళండి అంటూ దౌర్జన్యం చేస్తున్నారని విలపించారు.

# మన ఊరు-మన బాధ్యత” పేరుతో

## -పాల్తేరు గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక - న్యాయవాది దేవవరపు రాంబాబు



పాయకరావుపేట, జులై 27 : (తెలుగు రాష్ట్రం ప్రతినిధి)

గ్రామ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తూ పాయకరావుపేట మండల పరిధిలోని పాల్తేరు గ్రామంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. గ్రామం యొక్క అభివృద్ధి సమస్యల నివారణ కొరకు తీసుకోవలసిన చర్యలపై “మన ఊరు మన బాధ్యత” పేరుతో వినాయక గుడివీధి పల్లపు వీధిలో ఆదివారం రాత్రి జరిగిన ఈ సమావేశానికి హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలోని ప్రస్తుత పరిస్థితులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పరిష్కార మార్గాలపై నిర్ణయాలు తీసుకున్నారు. రాబోయే ఐదేళ్ల కాలంలో మిత్రుల సహకారంతో రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ప్రముఖ వ్యాపారవేత్తలను సంప్రదించి గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చడానికి లాయర్ రాంబాబు ముందుకు వచ్చారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం, విద్యార్థుల కోసం ఉన్నత పాఠశాల ఆటస్థల ఆధునికీకరణ, యువత విద్యార్థుల కోసం సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు, మంచినీళ్ల చెరువు గట్టును వాకింగ్ ట్రాక్గా మార్చడం, గ్రామానికి నూతన పంచాయతీ భవన నిర్మాణం, అవసరమైన చోట్ల రోడ్ల నిర్మాణం, మరమ్మతులు మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడం, చిన్న పిల్లలు గర్భిణుల కోసం అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడం, వ్యవసాయ అవసరాలకు గాను గోదావరి మరియు తాండవ నీటిని గ్రామానికి తీసుకు వచ్చేందుకు కృషి చేయడం గ్రామంలోని ఆలయాల అభివృద్ధి తగిన రక్షణ కల్పించడం వంటి అంశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సదస్సులో తీర్మానం చేశారు. పార్టీలకి అతీతంగా పాల్తేరు గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని గ్రామ పెద్దలు కోరారు ఈ బృహత్తర ప్రణాళిక కార్యరూపం దాల్చి విజయవంతం చేయడానికి గ్రామ యువకులు, మిత్రులు, పెద్దలు తనను ప్రోత్సహించి సహకారాన్ని అందించాలని రాంబాబు కోరారు.


# శ్రీ ప్రకాష్ అండర్-19 బాలికల ఖో-ఖో జట్టు సిబిఎస్ఇ క్లస్టర్ పోటీలలో విజేతగా నిలిచి జాతీయ స్థాయికి అర్హత,,



పాయకరావుపేట, జులై 27 : తెలుగు రాష్ట్రం ప్రతినిధి,,

శ్రీ ప్రకాష్ (సీబీఎస్ఈ) అండర్-19 బాలికల ఖో-ఖో జట్టు అనూహ్య ప్రతిభ కనబరిచి జులై 23 నుండి 26 వరకు కరీంనగర్, తెలంగాణాలో నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్ ఖో-ఖో పోటీల్లో ప్రథమ స్థానం సాధించి ఛాంపియన్గా అవతరించి, బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. పోటీలో జట్టు సభ్యులు అత్యుత్తమ సమన్వయం, క్రమశిక్షణ, పోరాట పటిమను ప్రదర్శిస్తూ ప్రత్యర్థి జట్లపై విజయాలు సాధించడం ద్వారా విద్యా సంస్థకు విశేష కీర్తిని తీసుకువచ్చారు.జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన కోచ్లు చిరంజీవి, హేమలను ప్రత్యేకంగా అభినందిస్తూ వారి శిక్షణ, మార్గదర్శకత్వం, అంకితభావం విద్యార్థుల విజయానికి బలమైన పునాది అని కొనియాడారు. విద్య, క్రీడలతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి శ్రీ ప్రకాష్ ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తోందని, ఈ విజయం ఆ దిశగా మరో మైలురాయిగా నిలిచిందని యాజమాన్యం పేర్కొంది.ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత సిహెచ్ వి కె నరసింహారావు, జాయింట్ సెక్రటరీ సిహెచ్ విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, ప్రిన్సిపాల్ రవి కుమ్మమూరు జట్టు సభ్యులను అభినందించారు. సెప్టెంబర్ 19 నుండి 23 వరకు చెన్నై, తమిళనాడులో జరిగే జాతీయ స్థాయి పోటీలలో కూడా ఇదే విజయోత్సాహంతో అత్యుత్తమ ప్రతిభ కనబరచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# అభ్యాస కాలేజీలో ఉచిత కుట్టు మిషను శిక్షణ శిబిరం



మొగల్తూరు జులై 27, (తెలుగు రాష్ట్రం విలేఖరి):

మండలం కేంద్రమైన మొగల్తూరుశివారు లాకు పల్లపాలెంలో గల అభ్యాస కాలేజీ నందు సోమవారం శ్రీ మెడిది సుబ్బయ్య ట్రస్ట్ వారి ఆర్థిక సహాయంతో ఉమెన్స్ హెల్త్ కేర్ సొసైటీ వారు ఉచిత కుట్టు మిషన్ లు శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొగల్తూర్ సొసైటీ చైర్మన్ నిప్పులేటి తారక రామారావు, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి దాసరి బాబీ,బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి గన్నాబత్తుల సత్యవతి, బీజేపీ మొగల్తూరు మండల అధ్యక్షులు కొల్లాటి చెన్నకేశవరావు,కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పులపర్తి రమేష్ కుమార్,బీజేపీ మొగల్తూరు మండలం ప్రధాన కార్యదర్శి బొరుసు శివ , ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు కృత్తివేంటి శివ నాగరాజు,జిల్లా కార్యవర్గ సభ్యులు ఇంటి ఏడుకొండలు , కొపనాది పెద్దిరాజు,కడలి శ్రీమన్నారాయణ, పోతాబత్తుల పెద్దిరాజు,కుమ్మరపురుగు నాగేశ్వరరావు,బంధన శ్రీనివాస్,బెల్లంకొండ శేషగిరి,బల్ల సూరిబాబు, తణుకుల ప్రసాద్ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడద్దు మోదీజీ

## -నీట్ పేపర్ లీక్ వల్ల ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలి -సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు - ఎన్ టీ ఏ ను రద్దు చేయాలని కాకినాడలో సీపీఐ ధర్నా




కాకినాడ, జూలై 27న్యూస్ (తెలుగు రాష్ట్రం విలేఖరి)

నీట్ పరీక్షల లీకుకు మరణించిన విద్యార్థి కుటుంబ సభ్యులకు కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు సోమవారం ఉదయం స్థానిక గోదారిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ కాకినాడ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎన్ టి ఏ ను రద్దుచేసి పరీక్ష నిర్వహణను రాష్ట్రాలకు అప్పజెప్పాలని, చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్టీ జాతీయ సమితి ఆధ్వర్యంలో సుమారు గంట పాటు ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాటిపాకమధుమాట్లాడుతూవిద్యావ్యవస్థలోమాఫియాలను అరికట్టాలని, మరియు ప్రక్షాళన చేయాలని ఆయన కోరారు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళన చేసిన వారిపై పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎన్ టీ ఏ ల రద్దు చేయాలని డిమాండ్ చేశారు 2020 లో ప్రవేశపెట్టిన కమ్యూనల్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ని వెంటనేఉపసహించుకోవాలని మధు డిమాండ్ చేశారు అనంతరం అక్కడ నుంచి డైరీ ఫార్మ్ వరకు ప్రదర్శనగా వెళ్లారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు సకా రామకృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు పద్మ, సీపీఐ నాయకులు గోవింద్, కుమారి, రామలక్ష్మి, సతీష్, అన్నవరం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు

# ఎన్ఆర్ఐ శశిధర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మెగా జాబు మేళా



పిఠాపురం జులై 27(తెలుగు రాష్ట్రం విలేఖరి)

పిఠాపురం ఎన్ఆర్ఐ శశిధర్ ప్రతిపాదు నియోజకవర్గంలో బివిఆర్ కన్వెన్షన్ నందు మెగా జాబు మేళా ఏర్పాటు చేశారు.ప్రత్తిపాడులో భారీ మెగా జాబ్ మేళా స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అర్వెన్సిస్ గ్రూప్ సీఈఓ శేషిధర్ కొలికొండ నాయకత్వంలో కాకినాడ జిల్లా జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో భారీ మెగా జాబ్ మేళా నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మరియు ఆస్ట్రేలియా అరవెన్సిస్ ఫైనాన్స్ డైరెక్టర్ సేడ్నీ జెపి బోర్గ్ ఎన్ఆర్ఐ విచ్చేశారు.ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ శశి మాట్లాడుతూ 100కు పైగా ప్రముఖ కంపెనీలు,5000కు పైగా ఉద్యోగ అవకాశాలుస్పాట్ ఇంటర్వ్యూలు,స్పాట్ సెలక్షన్స్,10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఫార్మసీ డి ఫార్మసీ,బి ఫార్మసీ, మరియు ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు అని మొత్తం 5.2 వేల దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారని, వాటిలో ఈరోజు ఆన్లైన్లోకి వచ్చినందున 3.2 వేల ఉద్యోగాలు సమీక్షించబడలేదు.2 వేల వాక్-ఇన్లు ఫ్లోటింగ్లో ఉన్నాయి. 356 ఉద్యోగాలు ఆఫర్ చేయబడ్డాయి.544 షార్ట్లిస్ట్ చేయబడ్డాయి అని ఈ ఈవెంట్ నుండి ఈరోజు మొత్తం 900 ఉద్యోగాలకు ఎంపిక కాబడారని, మరల మూడు రోజులు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తద్వారా మరింత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంటర్ ఫెలోషిప్ ద్వారా స్వచ్ఛందంగా సొంతంగా తమ ఆలోచనలతో వ్యాపారం చేయాలనుకున్న వారికి స్కై ఫౌండేషన్ ద్వారా 1 కోటి రూపాయల వ్యయంతో తోర్పటు కల్పిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ వన్ ఆఫ్ ది మెంబర్ కోలికొండ శ్రీనివాస్, శశి టీమ్, తదితరులు పాల్గొన్నారు.

# హార్దిక్ కావాలా.. అయితే చెన్నై నుంచి అతడిని ఇవ్వాల్సిందేనని కండీషన్ పెట్టిన ముంబై

**హార్దిక్ పాండ్యా ఐపీఎల్ 2027 కు ముందు ముంబై ఇండియన్స్ ను వీడనున్నాడా? సీఎస్‌కేతో ట్రేడ్ చర్చల్లో ఆయుష్ మ్హత్రే, శివమ్ దూబే పేర్లు తెరపైకి వచ్చాయి. హార్దిక్ భవిష్యత్తుపై క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.**

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ జట్టును వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పలు ఫ్రాంచైజీలు అతనిని ట్రేడింగ్ ద్వారా తమ జట్లలోకి తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తుండగా, ఈ రేసులో చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) అందరికంటే ముందు వరుసలో ఉంది. అయితే ఇప్పటివరకు ఈ రెండు జట్ల మధ్య ట్రేడ్ ఒప్పందం కుదరలేదు. హిందుస్థాన్ టైమ్స్ నివేదిక ప్రకారం.. హార్దిక్ పాండ్యాకు ప్రతిఫలంగా ముంబై ఇండియన్స్ యాజమాన్యం చెన్నై నుంచి ఆయుష్ మ్హత్రే, శివమ్ దూబేలతో పాటు కొంత నగదును డిమాండ్ చేస్తోందని సమాచారం. కానీ చెన్నై యాజమాన్యం తమ యంగ్ బ్యాటర్ ఆయుష్ మ్హత్రేను వదులుకోవడానికి సిద్ధంగా లేదు.

హార్దిక్‌ను పంపడానికి ప్రతిఫలంగా ముంబై ఇండియన్స్ అత్యంత బలమైన ట్రేడ్ ప్యాకేజీని డిమాండ్ చేస్తోంది. అందులో ముఖ్యంగా ఆయుష్ మ్హత్రేపై ముంబై దృష్టి పెట్టింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆయుష్ మ్హత్రే తన వినాశకరమైన ఆక్రమణ బ్యాటింగ్‌తో అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాడు. గాయం కారణంగా అతను ఆ సీజన్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడలేకపోయినప్పటికీ, ఆడిన కొద్ది మ్యాచ్‌ల్లోనే బ్యాట్‌తో భారీ ప్రభావం చూపాడు. అంతేకాకుండా, ఆయుష్ ముంబై డొమెస్టిక్ జట్టు తరఫున ఆడటం కూడా ముంబై ఇండియన్స్ అతని కోసం పట్టుబట్టడానికి ప్రధాన కారణం. తమ యంగ్ స్టార్ ఆయుష్ మ్హత్రేను జట్టులోనే ఉంచుకోవడానికి చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్‌కు సరికొత్త కౌంటర్ ఆఫర్‌ను




ప్రతిపాదించింది. నివేదికల ప్రకారం.. హార్దిక్ పాండ్యాకు బదులుగా శివమ్ దూబే, డెవాల్డ్ బ్రెవిస్‌లతో పాటు రూ.10 కోట్లు ఇస్తామని చెన్నై ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. ముంబై ఇండియన్స్ గనుక ఈ ఆఫర్‌ను అంగీకరిస్తే, వారికి ఆటగాళ్లు మరియు క్యాష్ రూపంలో రూ.20 కోట్లకు పైగా విలువైన ప్యాకేజీ లభించనుంది. అయితే ఈ ఆఫర్‌పై ఇప్పటివరకు ఇరు జట్ల యాజమాన్యాల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. హార్దిక్ పాండ్యా 2022లో ముంబై ఇండియన్స్‌ను వీడి గుజరాత్ టైటాన్స్ జట్టులోకి వెళ్లాడు. కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలి ఏడాదే గుజరాత్‌కు ట్రోఫీని అందించి, తదుపరి ఏడాది ఫైనల్‌కు తీసుకెళ్లాడు. ఆ తర్వాత 2024 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ అతనిని మళ్లీ ట్రేడ్ చేసుకుని కెప్టెన్‌గా నియమించింది. అయితే ఆ ఏడాది ముంబై పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో నిలిచింది. 2025లో ప్లేఆఫ్స్ చేరినప్పటికీ, 2026లో హార్దిక్ బ్యాట్, బాల్ రెండింటితోనూ ఆకట్టుకోలేకపోవడంతో ముంబై 9వ స్థానంతో సరిపెట్టుకుంది. అయినప్పటికీ హార్దిక్ ఫాస్ట్ బౌలింగ్ చేయగల ప్రమాదకర మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కావడంతో పాటు కెప్టెన్సీ అనుభవం ఉండటంతో, కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR), రాజస్థాన్ రాయల్స్ (RR) కూడా అతన్ని ట్రేడ్ చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి.

# అంతా ఓకే..కానీ ఆ ఒక్క విషయంలో మారాలి..

## వైభవ్ సూర్యవంశీకి వీవీఎస్ లక్ష్మణ్ వార్నింగ్

**జింబాబ్వే సిరీస్‌లో అదరగొట్టిన 15 ఏళ్ల యంగ్ సెన్సేషన్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసలు కురిపించారు. అయితే భవిష్యత్తులో ప్రపంచ స్థాయి స్టార్‌గా ఎదగాలంటే ఫిట్‌నెస్‌పై మరింత దృష్టి పెట్టాలని కీలక సూచన చేశారు.**

జింబాబ్వేతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 49 బంతుల్లో 81 పరుగులు చేసి జట్టు ఘనవిజయంలో కీలక పాత్ర పోషించాడు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను భారత్ గెలుచుకోవడంలో ప్రధాన పాత్ర పోషించిన వైభవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను కూడా కైవసం చేసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం భారత తాత్కాలిక ప్రధాన కోచ్ వివిఎస్ లక్ష్మణ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం 15 సంవత్సరాల వయస్సులోనే వైభవ్ చూపుతున్న ఆత్మవిశ్వాసం, పరిణతి అద్భుతమని కొనియాడిన లక్ష్మణ్, భవిష్యత్తులో అతను మరింత ఎదగడానికి ఓ కీలకమైన సలహా ఇచ్చారు.

వైభవ్ సూర్యవంశీలోని ప్రతిభను బీసీసీఐ రెండున్నర సంవత్సరాల క్రితమే గుర్తించిందని లక్ష్మణ్ వెల్లడించారు. 2024 అండర్-19 ప్రపంచ కప్‌కు ముందు విజయవాడలో జరిగిన క్వాడ్రాంగ్యులర్ సిరీస్‌లో ఇండియా-బి తరఫున వైభవ్ అత్యధిక పరుగులు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచే అతనికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్యాంపుల్లో శిక్షణ ఇస్తూ, అండర్-19 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచేలా తీర్చిదిద్దామని తెలిపారు. వైభవ్ ఒక ఆటగాడిగానే కాకుండా వ్యక్తిగతంగా ఎలాంటి ఆలోచనా ధోరణి కలిగి ఉంటాడో మేనేజ్‌మెంట్‌కు పూర్తిగా తెలుసని లక్ష్మణ్ చెప్పారు.

గత ఆరు నెలల కాలంలో వైభవ్ వ్యక్తిగతంగా ఎదిగిన తీరు, ఆటపై అతనికి ఉన్న అవగాహన, మెచ్యూరిటీ లెవల్స్ ఆకాశాన్ని తాకాయని లక్ష్మణ్ ప్రశంసించారు. అందుకే అంతర్జాతీయ స్థాయిలో పెద్ద పెద్ద బౌలర్లను ఎదుర్కొంటూ ఒత్తిడి సమయాల్లోనూ రాణించగలుగుతున్నాడని చెప్పారు. అయితే వైభవ్ ఇంకా చాలా మెరుగుపడాల్సిన ఏకైక ప్రధాన అంశం అతని ఓవరాల్ ఫిట్‌నెస్ అని లక్ష్మణ్ స్పష్టం చేశారు. అతను ఇంకా 15 ఏళ్ల




చిన్న కుర్రాడేనని, రాబోయే రోజుల్లో తన ఫిట్‌నెస్ స్థాయిలను పెంచుకుంటే క్రికెట్ ప్రపంచంలో తిరుగులేని ప్లేయర్‌గా మారతాడని లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు.

ఆటలోని ప్రతి విభాగంలోనూ తానను తాను మెరుగుపరుచుకోవాలనే తపన వైభవ్‌లో స్పష్టంగా కనిపిస్తుందని కోచ్ లక్ష్మణ్ కొనియాడారు. మూడో టీ20 మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో దెబ్బ తగిలి గాయపడినప్పటికీ, మైదానాన్ని వదిలి వెళ్లకుండా జట్టు కోసం ఫీల్డింగ్ కొనసాగించాలని వైభవ్ భావించాడని తెలిపారు. కానీ జట్టు ఫిజియో వచ్చి బలవంతంగా అతనిని బయటకు తీసుకువెళ్లారని చెప్పారు. చిన్న వయసులోనే జట్టు విజయం కోసం అతను చూపించిన ఈ అంకితభావం, పట్టుదల నిజంగా అభినందనీయమని లక్ష్మణ్ ప్రశంసించారు.

# అవన్నీ దాసోహం..

## అదొక్కటి మీరాబాయి చేతికి చిక్కితే!



**కుటుంబంతోపాటు స్నేహితులు, శ్రేయోభిలాషుల నుంచి నాపై చాలా ఒత్తిడి ఉండేది. ఇప్పుడు భారత్ తరఫున మూడో స్వర్ణ పతకం సాధించినందుకు సంతోషంగా ఉంది.**

ఇవన్నీ.. కామన్వెల్త్ గేమ్స్ 2026లో బరిలోకి దిగే ముందు, తర్వాత భారత మహిళా వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను నుంచి వచ్చిన స్టేట్‌మెంట్లు. స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్‌లో 190 కేజీలు ఎత్తి రికార్డు సృష్టించిన మీరాబాయి.. కామన్వెల్త్ గేమ్స్‌లో హ్యాట్రిక్ గోల్డ్‌ను ఖాతాలో వేసుకుంది. మరో రెండు నెలల్లో ప్రారంభం కాబోయే ఆసియా గేమ్స్‌లోనూ సత్తా చాటాలని చూస్తోంది. మణిపూర్ నుంచి ప్రపంచ స్థాయి వేదికపై సత్తా చాటుతోన్న మీరాబాయికి ఇంకా ఆ ఒక్క లోటు మాత్రం మిగిలే ఉంది.

### 31 ఏళ్ల వయసులోనూ..

ముప్పై ఏళ్లు వచ్చిన క్రీడాకారులు క్రికెట్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్.. ఇలాంటి క్రీడల్లో సీనియార్టీ సాధించి అనుభవంతో ఆడే వయసు. కానీ, వెయిట్‌లిఫ్టింగ్‌లో మాత్రం పరిస్థితి భిన్నం. సాధారణంగా మహిళా వెయిట్ లిఫ్టర్ల సగటు వయసు పాతికేళ్లు. ఈ సమయంలో వారి అత్యున్నత ప్రదర్శన బయటకు వస్తుంది. వయసు పెరిగే కొద్దీ శరీరంలో మార్పులు రావడంతోపాటు కండరాల పట్టు కూడా తగ్గుతూ ఉంటుంది. కానీ, 31 ఏళ్ల మీరాబాయి మాత్రం పెద్ద వేదికలపై మరింత ఉత్సాహంగా బరిలోకి దిగుతూ.. యంగ్ వెయిట్ లిఫ్టర్లపై ఆధిపత్యం ప్రదర్శించడం అద్భుతమే.

నేను బరువు తగ్గడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ఏ అథ్లెట్‌కైనా ఇబ్బందే. నేను 48 కేజీల విభాగంలో తలపడ్డా. సాధారణంగా నా బరువు 50.5 కేజీలు. దానిని 49 కేజీల వరకు తగ్గించగలిగా. దాదాపు ఒకటిన్నర కేజీ. కానీ, అక్కడ నుంచి 48 కేజీలకు రావడం చాలా కష్టంగా మారింది. అందుకోసం గత రెండు రోజులుగా ఆహారం కూడా తీసుకోలేదు - మీరాబాయి చాను

### అప్పుడు సిల్వర్.. తర్వాత హ్యాట్రిక్ గోల్డ్‌లే

మీరాబాయి చాను పేరు వినగానే 'కామన్వెల్త్ క్వీన్' అని గుర్తుకురావడం ఖాయం. ఎందుకంటే 19 ఏళ్ల వయసులో తొలిసారి 2014లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో బరిలోకి దిగింది. అప్పుడు కేవలం 3 కిలోల తేడాతో బంగారు పతకం కోల్పోయింది. మీరా 170 కిలోలు లిఫ్ట్ చేయగా.. గోల్డ్ మెడల్ దక్కించుకున్న సంజితా చాను 173 కిలోలు ఎత్తేసింది. ఇప్పుడు 12 ఏళ్ల తర్వాత.. 190 కిలోలు ఎత్తేసి స్వర్ణ పతకం మెడలో ధరించింది. మధ్యలో 2018, 2022లోనూ ఆమెకే బంగారు పతకాలొచ్చాయి. 2018లో 196 కేజీలు (86 కేజీల స్నాచ్ - 110 కేజీల క్లీన్ అండ్ జెర్క్), 2022లో అయితే ఏకంగా 201 కేజీలు (88 కేజీల స్నాచ్ - 113 కేజీల క్లీన్ అండ్ జెర్క్) ఎత్తి కామన్వెల్త్ గేమ్స్ రికార్డును తన ఖాతాలో వేసుకుంది.

### ఆ లోటును భర్తీ చేయడమే లక్ష్యంగా..

మీరాబాయి ఇప్పటి వరకు చాలా ఘనతలను సాధించింది. దాదాపు రెండు దశాబ్దాల నిరీక్షణకు తెర దించి.. 2017లో వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత కామన్వెల్త్‌లోనూ సత్తా చాటింది. కానీ, ఆసియా గేమ్స్ మాత్రం ఆమెకు కలిసి రావడం లేదు. వెన్ను నొప్పి కారణంగా 2018 ఆసియా క్రీడలకు దూరమైంది. ఆ తర్వాత టోక్యో ఒలింపిక్స్‌లో సిల్వర్ నెగ్గి సత్తా చాటినా.. మళ్లీ 2023 ఆసియా గేమ్స్‌లో తడబాటుకు గురైంది. నాలుగో ప్లేస్‌తో సరిపెట్టుకుంది. అన్ని పతకాలను నెగ్గినా.. ఆసియా గేమ్స్ పోడియం ఎక్కే అవకాశం మాత్రం ఇంకా రాలేదు. ఈసారి ఆ లోటును తీర్చుకోవాలనేదే చాను లక్ష్యం. అయితే, ఆసియా క్రీడల్లో తప్పకుండా స్నాచ్‌లో 90కేజీల బరువును ఎత్తి పతకం సాధిస్తానని నమ్మకంగా చెబుతోంది.

# పాక్ బాక్సర్‌పై నా విజయం

## కార్గిల్ హీరోలకు అంకితం: జాదుమణి

కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బాక్సర్ జాదుమణి సింగ్ అద్భుతం చేశాడు. పురుషుల 55 కేజీల విభాగంలో ఈ 22 ఏళ్ల మణిపుర్ బాక్సర్.. పాకిస్థాన్ బాక్సర్ సుమామ రెహమాన్‌ను చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఆదివారం రాత్రి జరిగిన రౌండ్16లో తన ప్రత్యర్థిపై 5-0 తేడాతో అతడు విజయం సాధించాడు. దీంతో బాక్సింగ్‌లో భారత పతక ఆశలను సజీవంగా ఉన్నాయి. అయితే ఈ పోటీ కార్గిల్ విజయ్ దివస్ నాడు జరగడంతో.. జాదుమణి విజయం మరింత ప్రత్యేకంగా మారింది. ఈ పోరు అనంతరం అభిమానులను ఉద్దేశించి మాట్లాడిన అతడు.. తన విజయాన్ని కార్గిల్ హీరోలకు అంకితం ఇస్తున్నట్లు ప్రకటించాడు. “మన కార్గిల్ హీరోలకు నా విజయం అంకితం. పాకిస్థాన్ బాక్సర్‌పై విజయానికి గర్వపడుతున్నా. క్వార్టర్ ఫైనల్స్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేసి ముందుకు సాగుతా. భారత్‌కు బంగారు పతకం సాధించేందుకు ప్రయత్నిస్తా” అని జాదుమణి వెల్లడించాడు. 1999 కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయానికి గుర్తుగా ఏటా జులై 26న 'కార్గిల్ విజయ్ దివస్'ను నిర్వహిస్తారు. ఇలాంటి రోజునే పాక్ బాక్సర్‌పై జాదుమణి విజయం సాధించడం విశేషం. తొలి రౌండ్‌లో బై దక్కడంతో సుమామ రెహమాన్ ప్రిక్వార్టర్స్‌లోకి అడుగు పెట్టాడు. ఇక్కడ జాదుమణి దెబ్బకు పాక్ బాక్సర్ దగ్గర సమాధానం లేకుండా పోయింది.

# వైభవ్ సూర్యవంశీ తలరాత మార్చిన విజయవాడ!

## వీవీఎస్ లక్ష్మణ్ బయటపెట్టిన సీక్రెట్

**తొలి సారి వైభవ్ సూర్యవంశీ ప్రతిభ తమ దృష్టికి అక్కడే వచ్చిందని వీవీఎస్ లక్ష్మణ్ తెలిపారు. 2024 అండర్-19 ప్రపంచకప్‌కు ముందు జరిగిన ఆ టోర్నీలో అతడు టాప్ ప్రదర్శన కనబరిచాడని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలంటే ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.**

వైభవ్ సూర్యవంశీ.. ఇండియన్ క్రికెట్‌కు ఫ్యూచర్ సూపర్ స్టార్‌గా మారుతున్నాడు. ఐపీఎల్‌లో దుమ్మురేపిన ఈ వండర్ కిడ్, ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడి పెద్దగా రాణించలేదు. కానీ జింబాబ్వేపై ఇరగదీశాడు. మూడు మ్యాచ్‌ల్లో రెండు హాఫ్ సెంచరీలు సాధించి అదరగొట్టాడు. చివరి మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు కూడా గెలిచాడు. దీంతో మెల్లమెల్లగా వైభవ్ ట్రాక్‌లోకి వస్తున్నాడంటూ క్రికెట్ అభిమానులు ఖుషీగా ఉన్నారు. అయితే ఈ యువ క్రికెటర్ టాలెంట్ ఐపీఎల్‌తోనే బయటపడిందని అంతా అనుకుంటున్నారు.


కానీ, కాదు.. వైభవ్ సూర్యవంశీ తలరాతను మార్చింది ఐపీఎల్ కానే కాదు. అంతకు ముందే అతని ప్రతిభను గుర్తించారు క్రికెట్ పెద్దలు. అది కూడా విజయవాడ సాక్షిగా వైభవ్ అనే యువ సంచలనం బీసీసీఐ పెద్దల దృష్టిలో పడ్డాడు. ఈ విషయం ఎవరో కాదు టీమిండియా మాజీ క్రికెటర్, నేషనల్ క్రికెట్ అకాడమీ హెడ్, తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ వెల్లడించారు. క్వాడ్రాంగ్యూలర్ సిరీస్ ఆడేందుకు విజయవాడకు వచ్చిన సమయంలోనే వైభవ్ ప్రతిభ తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు.

లక్ష్మణ్ మాట్లాడుతూ.. 2024 అండర్-19 ప్రపంచకప్‌కు ముందు జరిగిన ఆ టోర్నీలో వైభవ్ ఆటతీరు సెలెక్టర్లను, కోచ్‌లను బాగా ఆకట్టుకుందని చెప్పారు. ఆ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఆటగాళ్లలో వైభవ్ ఒకడిగా నిలిచాడని వెల్లడించారు. వైభవ్‌లో అసాధారణమైన బ్యాటింగ్ ప్రతిభ ఉందని, చిన్న వయసులోనే ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం చూపించాడని లక్ష్మణ్ ప్రశంసించారు. అయితే, అంతర్జాతీయ స్థాయిలో మరింత విజయవంతం కావాలంటే ఫిట్‌నెస్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు.

నైపుణ్యంతో పాటు శారీరక దారుఢ్యం కూడా ఆధునిక క్రికెట్‌లో కీలకమని, ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకుంటే వైభవ్ భవిష్యత్తులో భారత జట్టుకు కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. యువ ఆటగాళ్లకు సరైన మార్గదర్శకత్వం, క్రమశిక్షణ, ఫిట్‌నెస్ ఉంటే ప్రపంచ స్థాయిలో రాణించగలరని పేర్కొన్న ఆయన, వైభవ్ సూర్యవంశీ ఆ దిశగా మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.



CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక




## ‘శ్రీనివాస మంగాపురం’ నుంచి ‘ఉక్కిరి బిక్కిరి’ వీడియో సాంగ్ రిలీజ్...

### క్యూట్ గా కనిపిస్తున్న జయకృష్ణ, రాషా జోడీ

ఘట్టమనేని కుటుంబం నుంచి హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, రాషా థడానీ జంటగా నటిస్తున్న చిత్రం ‘శ్రీనివాస మంగాపురం’. విభిన్నమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. జూలై 30న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ సినిమా నుంచి ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, తాజాగా ‘ఉక్కిరిబిక్కిరి’ పూర్తి వీడియో సాంగ్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పాట సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రముఖ స్వరకర్త జీవీ ప్రకాశ్ కుమార్ స్వరపరిచిన ఈ మెలోడీకి చంద్రబోస్ సాహిత్యం అందించగా, గాయకుడు హరిచరణ్ తన గాత్రంతో ప్రాణం పోశారు. హీరో హీరోయిన్ల మధ్య గాఢమైన ప్రేమను, భావోద్వేగాలను ఆవిష్కరించేలా ఈ పాటను చిత్రీకరించారు. అందమైన విజువల్స్, జయకృష్ణ–రాషాల మధ్య కెమిస్ట్రీ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఒక అందమైన ప్రేమకథకు జీవీ ప్రకాశ్ అందించిన సంగీతం అద్భుతంగా ఉందని ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వస్తున్నాయి. చందమామ కథలు పిక్చర్స్ ఎల్ఎల్‌పి పతాకంపై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాత సి. అశ్విని దత్ సమర్పిస్తున్నారు. ఈ సినిమాలో మోహన్ బాబు, బ్రహ్మాజీ, నరేష్, కిక్ శ్యామ్, అజయ్, వాసుకి వంటి భారీ తారాగణం నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. జయకృష్ణ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, మాధవ్ కుమార్ గుళ్లపల్లి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో, ఈ పాట సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.

## ‘దైవశక్తి ఆగమన తేదీ ఖరారైంది’..

### సుమంత్ ‘మహేంద్రగిరి వారాహి’ రిలీజ్ డేట్ ఫిక్స్


**విడుదల తేదీని ప్రకటించిన సుమంత్ ‘మహేంద్రగిరి వారాహి’ చిత్రబృందం**
**సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న సినిమా**




విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సుమంత్, తాజాగా నటిస్తున్న ఆసక్తికర చిత్రం ‘మహేంద్రగిరి వారాహి’. ‘సుబ్రహ్మణ్యపురం’ వంటి థ్రిల్లర్‌తో ప్రశంసలు అందుకున్న సంతోష్ జాగర్లపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. 2026, సెప్టెంబర్ 11న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ఒక ప్రత్యేక పోస్టర్‌తో వెల్లడించింది. “దైవశక్తి ఆగమన తేదీ ఖరారైంది” (ప్త్రవ-ాతీతీఱజుశ్రీ ఱఞవ శీట్ ష్త్రవ ఱఆజఆఅవ ఖీశీతీఎవ ×ం ాశీఎనివవ) అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో విడుదల చేసిన ఈ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది. ఇందులో సుమంత్‌కు జోడీగా మీనాక్షి గోస్వామి నటిస్తుండగా, ఐశ్వర్య రాజేశ్ ఓ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల, శుభలేఖ సుధాకర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మధు కలిపు, ఎం.సుబ్బారెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విలక్షణమైన కథాంశంతో, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూరుస్తుండగా, ఆర్.కె.ప్రతాప్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎన్.ఎన్. మురళీధర్ కథ అందించిన ఈ సినిమాకు సంతోష్ జాగర్లపూడి తనదైన శైలిలో స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## గాంధీ జయంతి రోజున వస్తున్న ‘ఆదర్శ కుటుంబం’




‘సంక్రాంతికి వస్తున్నాం’ వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత విక్టరీ వెంకటేష్‌ను సోలో హీరోగా వెండితెరపై చూడాలని మురిసిపోతున్న దగ్గుబాటి అభిమానులకు ఊరటనిస్తూ ‘ఆదర్శ కుటుంబం ఏకే 47’ చిత్ర బృందం ప్రమోషన్ల వేగం పెంచింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి నాలుగు ముఖ్యమైన పాత్రలకు సంబంధించిన వీడియో టీజర్లను ఒక్కొక్కటిగా విడుదల చేస్తూ మేకర్స్ ఆకట్టుకుంటున్నారు. ఈ సినిమాలో వెంకటేష్ ‘చిట్టిబాబు’ అనే వినోదాత్మక పాత్రలో కనిపించనున్నారు. భారీ ఎలివేషన్లు, పాన్ ఇండియా తాపత్రయాలు, చెవులు హోరెత్తే బీజీఎంల జోలికి పోకుండా.. ‘అల వైకుంఠపురములో’ తరహాలో ప్రథమార్ధం సరదాగా సాగుతూ, ఇంటర్వెల్ ట్విస్ట్‌తో ద్వితీయార్థంలో వినోదం మరియు పోరాట ఘట్టాల సమాహారంగా ఈ చిత్రాన్ని మలిచినట్లు తెలుస్తోంది.

**సమకాలీన పోటీలో ప్రత్యేక మార్క్: అక్టోబర్ 2న విడుదలకు సిద్ధం!**

చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున వంటి సీనియర్ హీరోలు ప్రస్తుతం మాఫియా, సీరియస్ బ్యాక్‌డ్రాప్ కథలతో బిజీగా ఉండగా, వెంకటేష్ మాత్రం పూర్తిస్థాయి ఫ్యామిలీ కామెడీకి క్రైమ్ టచ్ జోడించి వైవిధ్యమైన బాట పట్టారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2న ఈ చిత్రాన్ని యథాతథంగా విడుదల చేసేందుకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. ఈ ప్రాజెక్ట్‌కు మొదట హర్షవర్ధన్ రామేశ్వర్‌ను సంగీత దర్శకుడిగా అనుకున్నప్పటికీ, కారణాంతరాల వల్ల ఆయన స్థానంలో తమన్ బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ పూర్తి చేసిన తమన్, సెప్టెంబర్‌లో ఫైనల్ కాపీ వచ్చాక రీ–రికార్డింగ్ పనులను ప్రారంభించనున్నారు. ఎన్టీఆర్‌తో చేయబోయే భారీ ఫాంటసీ ప్రాజెక్ట్‌కు ముందు త్రివిక్రమ్‌కు ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ కావడం ఎంతో కీలకంగా మారింది.

## రవితేజ ‘ఇరుముడి’...

### ఆగస్టు 21న గ్రాండ్ రిలీజ్




మాస్ మహారాజా రవితేజ తన తదుపరి చిత్రంతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా, సెన్సిబుల్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘ఇరుముడి’ సినిమా విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ఓ కొత్త పోస్టర్‌తో వెల్లడించింది. ఇంకా 25 రోజుల్లో సినిమా రానుందంటూ చేసిన ఈ ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. మాస్, యాక్షన్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రవితేజ, ‘నిన్ను కోరి’, ‘మజిలీ’, ‘ఖుషి’ వంటి ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాలతో విజయం సాధించిన శివ నిర్వాణ కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో దీనిపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. “ అత్యంత హృద్యమైన తండ్రీకూతుళ్ల కథ” అంటూ మేకర్స్ ఈ సినిమా థీమ్‌ను పరిచయం చేశారు. రవితేజను ఇప్పటివరకు చూడని ఒక కొత్త ఎమోషనల్ పాత్రలో ఈ చిత్రం చూపించబోతోందని స్పష్టమవుతోంది. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ, బేబీ నక్షత్ర తండ్రీకూతుళ్లుగా కనిపించడం ఆకట్టుకుంటోంది. ఈ చిత్రాన్ని ప్రఖ్యాత నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, టీ–సిరీస్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రముఖ నటుడు సాయికుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ పూడి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒక మాస్ హీరో, ఎమోషనల్ కథతో వస్తుండటంతో ‘ఇరుముడి’ చిత్రంపై సినీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో ఆసక్తి రెట్టింపయింది.

## పూరి జగన్నాథ్ తల్లి కన్నుమూత

### విషాద వార్తను వెల్లడించిన పూరి కూతురు పవిత్ర



టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తల్లి కన్నుమూయడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషయాన్ని పూరీ కుమార్తె పవిత్ర సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ పోస్టుతో అభిమానులకు తెలియజేశారు. ప్రస్తుతం ఆమె షేర్ చేసిన పోస్ట్ నెటిజన్లను కంటతడి పెట్టిస్తోంది. తన నానమ్మతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ పవిత్ర ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఓ ఫొటోను షేర్ చేశారు. ఆ ఫొటోతో పాటు ఆమె రాసిన ఎమోషనల్ సందేశం అందరి హృదయాలను కదిలిస్తోంది. “ఇప్పుడు నన్నెవరు చిన్నతల్లి అని పిలుస్తారు? ప్రేమగా నాకెవరు ముద్దుపెడతారు? నీతో మరో రోజు గడిపే అవకాశం వస్తే ఎంత బాగుండేది. నీ 96వ పుట్టినరోజున ఇచ్చినట్లే మరోసారి పెద్ద హగ్ ఇస్తా. ఐ మిస్ యూ నానమ్మ” అంటూ పవిత్ర తన మనసులోని బాధను వ్యక్తం చేశారు. పవిత్ర చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినీ ప్రముఖులు, అభిమానులు, సన్నిహితులు పూరీ జగన్నాథ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. పూరీ జగన్నాథ్ ప్రస్తుతం తమిళ స్టార్ విజయ్ సేతుపతి హీరోగా తెరకెక్కిస్తున్న ‘స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్’ చిత్రంతో బిజీగా ఉన్నారు. అయితే, సినిమా పనుల్లో బిజీగా ఉన్న ఈ సమయంలో పూరీ జగన్నాథ్ కుటుంబంలో చోటుచేసుకున్న ఈ విషాదం సినీ వర్గాలను కూడా కలచివేసింది. అభిమానులు, పరిశ్రమకు చెందిన ప్రముఖులు పూరీ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.

## జూనియర్ ఎన్టీఆర్ భుజానికి గాయం..

### అభిమానుల్లో ఆందోళన

**ఆరు నుంచి ఎనిమిది వారాలు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించిన వైద్యులు**



ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకోగా, ఆయనకు కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఈ మేరకు వైద్యుల బృందం సోమవారం ఒక అధికారిక హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. ఇటీవలే బాలకృష్ణ షఉటింగ్ లో గాయపడగా, ఇప్పుడు ఎన్టీఆర్ కూడా గాయపడడంతో నందమూరి అభిమానులు ఆందోళనకు గురయ్యారు. కాగా, డాక్టర్ జె. మధుసూదన్ రావు, డాక్టర్ ఆర్. ఎ. పూర్ణచంద్ర తేజస్వి నేతృత్వంలోని వైద్య బృందం ఎన్టీఆర్‌కు పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించింది. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ శరీర పరిస్థితిని, గాయం తీవ్రతను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, భుజం కండరాలు మరియు ఎముకలు పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల విశ్రాంతి తప్పనిసరని వైద్యులు వెల్లడించారు. ఫలితంగా, ఆయన దాదాపు రెండు నెలల పాటు షఉటింగ్‌లకు దూరంగా ఉండి, విశ్రాంతికే పరిమితం కానున్నారు. అభిమానులు, శ్రేయోభిలాషులు ఆందోళన చెందాల్సిన పని లేదని, ఎన్టీఆర్‌కు మెరుగైన వైద్యం అందుతోందని వైద్యులు భరోసా ఇచ్చారు. మరోవైపు, గాయం విషయం తెలియగానే సోషల్ మీడియా వేదికగా అభిమానులు స్పందిస్తూ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పెద్ద ఎత్తున సందేశాలు పోస్ట్ చేస్తున్నారు.

## కోయంబత్తూరులో రామ్ చరణ్‌కు విజయవంతంగా ముగిసిన శస్త్రచికిత్స

**‘పెద్ది’ సినిమా షఉటింగ్‌లో అయిన గాయానికి చికిత్స**
**కోయంబత్తూరులోని గంగ ఆసుపత్రిలో శస్త్రచికిత్స**
**అమెరికా స్పెషలిస్ట్ డాక్టర్ పర్యవేక్షణలో ఆపరేషన్**



టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కుడి చేతికి సోమవారం విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తయింది. తమిళనాడులోని కోయంబత్తూరులో గల గంగ ఆసుపత్రిలో వైద్యులు ఈ చికిత్సను నిర్వహించారు. ‘పెద్ది’ చిత్రం షఉటింగ్ సమయంలో ఆయన మణికట్టుకు గాయం కావడంతో వైద్యులు ఈ శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరగా కోలుకుంటున్నారని వైద్య వర్గాలు వెల్లడించాయి. గంగ ఆసుపత్రి చైర్మన్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్. రాజశేఖరన్ పర్యవేక్షణలో ఈ శస్త్రచికిత్స జరిగింది. గాయం తీవ్రత దృష్ట్యా, అమెరికాలోని మయామికి చెందిన అంతర్జాతీయ ప్రసిద్ధి గాంచిన హ్యాండ్, రిస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ అలెజాండ్రో బడియాను ప్రత్యేకంగా కోయంబత్తూరుకు రప్పించారు. డాక్టర్ రాజశేఖరన్, డాక్టర్ బడియా, డాక్టర్ ప్రవీణ్ భరద్వాజ్ నేతృత్వంలోని నిపుణులైన వైద్యుల బృందం ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసింది. గతంలో చిరంజీవికి ఎదురైన వెన్నెముక సమస్యకు కూడా డాక్టర్ రాజశేఖరన్ చికిత్స అందించారు. ప్రస్తుతం రామ్ చరణ్ వేగంగా కోలుకుంటున్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి అత్యంత సంతృప్తికరంగా ఉందని వైద్యులు తెలిపారు. మరో నాలుగు రోజుల పాటు ఆసుపత్రిలోనే వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకున్న అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ‘పెద్ది’ చిత్రంలోని యాక్షన్, రెజ్లింగ్ సన్నివేశాల చిత్రీకరణ సమయంలో రామ్ చరణ్‌కు ఈ మణికట్టు గాయమైంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339